బుధవారం
24-07-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 33
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

స్టాలిన్, లెనిన్ విగ్రహాల ధ్వంసం

మాస్కో: సోవియట్ నాయకులు జోసెఫ్ స్టాలిన్, వ్లాదిమిర్ లెనిన్ విగ్రహాలను ఒక గుర్తుతెలియని వ్యక్తి ధ్వంసం చేశాడు. రష్యా రాజధాని మాస్కో సమీపంలోని జెవెనిగోరాడ్ నగరంలోని స్టాలిన్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన తర్వాత లెనిన్ విగ్రహంపై దాడి చేసి పరారయ్యాడు. ఇందుకు సంబంధించిన వీడియో లభించినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఆ వ్యక్తి చేతిలో సుత్తితో తొలుత స్టాలిన్ విగ్రహాన్ని చుట్టూ తిరిగి పరిశీలించడం, ఆపై ఒక్క వేటుతో తల భాగాన్ని వేరు చేసి వెళ్లిపోవడం కనిపించింది. పోలీసులు అతని కోసం గాలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఏపీకి పరోక్ష ఊరట!

- అభివృద్ధి ఏజెన్సీల ద్వారా అమరావతికి రూ.15 వేల కోట్లు
- పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తికి భరోసా
- వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు
- పారిశ్రామిక, కారిడార్ల అభివృద్ధికి సహకారం
- పూర్వోదయం పథకం కింద సహాయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి స్వల్ప ఊరట లభించింది. బడ్జెట్‌కు ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు... ప్రధాని నరేంద్ర మోదీతో పాటు హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా తదితర ముఖ్య నేతలందరినీ కలిసి ఏపీని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ అసమర్థత పాలన వల్ల ఏపీ అప్పుల ఊబిలో కూరుకోవడమే కాకుండా అన్ని రంగాలు తీవ్రంగా నష్టపోయాయని, తిరిగి గాడిన పెట్టాలంటే కేంద్రం ఆదుకోవాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టుల ప్రాధాన్యతలను ప్రధానికి సీఎం వివరించారు. కేంద్రంలోని

- మిగతా 2 లో

అమరావతికి ఇక మంచి రోజులు

- నిధులు ఏ రూపంలో వచ్చినా రాష్ట్రానికి మేలే
- కేంద్ర బడ్జెట్‌పై సీఎం చంద్రబాబు

రాజధాని నిర్మాణానికి నిధులు ఏ రూపంలో వచ్చినా రాష్ట్రానికి మేలే జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై మీడియా వద్ద ఆయన స్పందించారు. తాము పెట్టిన ప్రతిపాదనలు చాలా వరకు కేంద్రం ఆమోదించిందని తెలిపారు.

2 లో

ప్రజలకు మిగిలింది నిరాశే...

కేంద్ర బడ్జెట్‌లో మళ్లీ 'కార్పొరేట్ కలర్'

కుర్చీ కాపాడుకునేందుకు భాగస్వామ్య పక్షాలకు నూకలు విసిరిన మోదీ

కేంద్రంలో అధికారాన్ని కాపాడుకునే ప్రయత్నంలో మోదీ ప్రభుత్వం నానా తంటాలు పడుతోంది. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇందుకు అద్దంపడుతోంది. 'మిత్రలాభం...ప్రజాద్రోహం'ల సొంతం బడ్జెట్‌లో వర్ణనాతీతం. తనదైన శైలిలో ఇంకోసారి కార్పొరేట్ కలరిచ్చింది. తమ కుర్చీ కదలకుండా ఉండేందుకు అటు కార్పొరేట్లు, ఇటు కీలక భాగస్వామ్య పక్షాలను సంతృప్తిపర్చడమే లక్ష్యంగా బడ్జెట్ కొనసాగింది. ఎన్‌డీఏ ప్రభుత్వం అస్థిరత బడ్జెట్‌లో స్పష్టంగా గోచరించింది. బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని కీలక పక్షాల హామీలను నెరవేర్చకపోతే, సర్కారు పడిపోతుందని గట్టిగా నమ్ముతున్న మోదీ ఆ దిశగా బడ్జెట్‌ను రూపకల్పన చేసి, కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, అలాగే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై చిన్నచూపు ప్రదర్శించింది. యువతకు ఉపాధి కల్పించామని, నైపుణ్యత అందించామంటూ అబద్ధాలను వల్లెవేసింది. విద్య, ఆరోగ్యం, సంక్షేమ పథకాలపట్ల శీతకన్ను వేసింది. గడిచిన పదేళ్లలో నాలుగు రెట్లు లాభాలు ఆర్జించుకున్న కార్పొరేట్లకు మరిన్ని లాభాలిచ్చే ప్రక్రియకు ఈ కొత్త బడ్జెట్‌లో శ్రీకారం చుట్టింది. కార్పొరేట్లపై ఏ మాత్రం పన్నులు విధించకుండా జాగ్రత్తలు తీసుకున్న నిర్మల సామాన్యుల నెత్తిన నాట్యమాడుతున్న ధరాభారాన్ని తగ్గించడానికి మాత్రం వంద పేజీల బడ్జెట్‌లో ఒక్క పేజీని కూడా కేటాయించలేదు. పేదల పట్ల బీజేపీ దృక్కోణం బడ్జెట్‌లో విస్పష్టమైంది. విదేశీ పెట్టుబడులకు మరిన్ని దారులు కల్పిస్తూ ఎంఎస్ఎంఈలను వీలైనంత నీరుగార్చేందుకు సమాయత్తమైంది. ప్రజాప్రయోజనాలు కల్పించే ఏ రంగానికీ చెప్పుకోదగ్గ కేటాయింపులు చేయలేక చేతులు దులుపుకుంది. బీజేపీకి 8 మంది ఎంపీలనిచ్చిన తెలంగాణ ప్రజలను చావుదెబ్బతీసింది. ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే, గాలి కేటాయింపులతో గారడీ చేసింది. అమరావతి, పోలవరం నిధులు చేతిదాకా వస్తే తప్ప మోదీ ప్రభుత్వాన్ని నమ్మలేమని ఏపీ ప్రజలకు తెలుసు. పదేళ్ల క్రితం అమరావతికి శంకుస్థాపన చేసిన మోదీ ఇన్నేళ్లూ రాల్చని కాసులను ఇప్పటికిప్పుడు ఇచ్చేస్తాడంటే విశ్వసించగలమా?

(బడ్జెట్ పూర్తి వివరాలు లోపలి పేజీల్లో...)

మధ్యతరగతికి భరోసా: మోదీ

న్యూఢిల్లీ: లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. ఇది మధ్యతరగతి ప్రజలకు భరోసా ఇచ్చే బడ్జెట్ అని కొనియాడారు. దళితులు, అణగారిన వర్గాలకు శక్తినిచ్చే బడ్జెట్ అని పేర్కొన్నారు. 'మహిళల ఆర్థిక స్వావలంబనకు బాటలు వేశాం. చిరు వ్యాపారులు, ఎంఎస్ఎంఈల అభివృద్ధికి కొత్త బాటలు వేశాం. మౌలిక, తయారీ రంగాలను బలోపేతం చేసేలా ఈ బడ్జెట్ ఉంది. దేశ ఆర్థికాభివృద్ధికి ఈ బడ్జెట్ దోహదం చేస్తుంది. ఉద్యోగ కల్పన, స్వయం ఉపాధికి ప్రాధాన్యత ఇచ్చాం. ఎంప్లాయిమెంట్ లింక్‌డ్ స్కీమ్ ద్వారా కొత్త

- మిగతా 2 లో

కుర్చీ కాపాడుకోవడానికే: రాహుల్

న్యూఢిల్లీ: ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు. ఇది కుర్చీని కాపాడుకునే బడ్జెట్ అని దుయ్యబట్టారు. ఈ బడ్జెట్ తన మిత్రపక్షాలను సంతోషపెట్టేలా ఉందని ఆరోపించారు. ఇతర రాష్ట్రాలను పణంగా పెట్టి... బడ్జెట్‌లో తమ మిత్రపక్షాలకు బూటకపు వాగ్దానాలు చేశారని మండిపడ్డారు. తన స్నేహితులను సంతోషపెట్టడం కోసమే ఈ బడ్జెట్ తీసుకొచ్చారని, దీని నుంచి అదానీ, అంబానీ మాత్రమే ప్రయోజనం పొందుతారని పేర్కొన్నారు. ఎప్పట్లాగే ఈసారి కూడా సామాన్య భారతీయుడికి

- మిగతా 2 లో

కార్పొరేట్ల బడ్జెట్: సీపీఐ

న్యూఢిల్లీ: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం మారోమారు కార్పొరేట్ల విషయంలో తమ విధేయతను చాటుకున్నదని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) విమర్శించింది. పదేళ్లుగా అమలు చేస్తున్న విధానాల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేలా మోసపూరిత బడ్జెట్ ప్రవేశపెట్టిందని పార్టీ జాతీయ కార్యదర్శివర్గం మంగళవారం ఒక ప్రకటనలో వ్యాఖ్యానించింది. బీజేపీ అనుసరించే కార్పొరేట్ అనుకూల విధానాల రూపకల్పన, వినాశకర నిర్ణయాలతో సామాన్యుల వెతలు వర్ణనాతీతమయ్యాయని దుయ్యబట్టింది. విదేశీ కంపెనీల కోసం కార్పొరేట్ పన్నును 40 శాతం నుంచి

- మిగతా 2 లో

రాష్ట్రంలో శాంతి భద్రతలు పరిరక్షించాలి

- అసెంబ్లీలో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాలి
- సీపీఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ప్రత్యేక హోదాతోనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని , వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు బుందేల్ ఖండ్ తరహాలో నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. మంగళవారం సీఆర్ భవన్‌లో సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు పీ రామచంద్రయ్య, కార్యవర్గ సభ్యులు ఆవుల శేఖర్, జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్యతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభోత్సవం సందర్భంగా గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర విభజన తరువాత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎన్నికల సమయంలో ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలు లేవన్నారు. గత ప్రభుత్వం చేసిన అవినీతి అక్రమాలు, అప్పులపైనే గవర్నర్ ప్రసంగం సాగిందన్నారు. గవర్నర్ ప్రసంగంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజలు నమ్మి ఓటు వేసినందుకు ఎటువంటి భరోసా ఇస్తుందో చెప్ప లేదన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయని పూర్తిస్థాయి బడ్జెట్ ఏర్పాటు చేస్తే బాగుండేదన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో రోడ్లపరిస్థితి అధ్వాన్నంగా ఉన్నదనీ, పోలవరం

- మిగతా 2 లో

జగన్ నిర్వాకంతో
బడ్జెట్ పెట్టలేని దుస్థితి

- అసమర్థ పాలనతో అన్ని వ్యవస్థలు ధ్వంసం
- రాష్ట్రాన్ని గాడినపెట్టి... ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాం
- గవర్నర్‌కు ధన్యవాద తీర్మానంపై సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్ర ఆర్థిక ఇబ్బందుల వల్ల పూర్తిస్థాయి బడ్జెట్ కూడా పెట్టుకోలేని పరిస్థితి నెలకొందని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం నాలుగు అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేశామని, మరో మూడు అంశాలపై అసెంబ్లీలో విడుదల చేస్తామని తెలిపారు. వీటన్నింటిపై సమగ్రంగా చర్చించిన తర్వాతే రెండు నెలల సమయం తీసుకుని రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెట్టాలనే ఆలోచనకు వచ్చామన్నారు. అసెంబ్లీలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగానికి చంద్రబాబు ధన్యవాద తీర్మానం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లూ మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని మండిపడ్డారు. రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తయినా రాజధాని లేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు జాతి అంటే గతంలో మద్రాస్ అనేవారని, తెలుగు జాతి గౌరవాన్ని దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రపంచవ్యాప్తంగా పెంచారని కొనియాడారు. తెలుగు వారంటే ఆంధ్ర ప్రదేశ్ అనేలా ఎన్టీఆర్ చేశారని గుర్తుచేశారు. అదే జగన్ ఏపీ అంటే పెట్టుబడిదారులు భయపడేలా అరాచకపాలన సాగించారని విమర్శించారు. అన్ని వ్యవస్థలను ధ్వంసం చేశారని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దింపారన్నారు. రాష్ట్రానికి అత్యంత కీలకమైన అమరావతిని సర్వ నాశనం చేశారు. రాజధాని కలను చంపేశారు. అమరావతి దేవతల రాజధాని. అటువంటి దానిని నిన్నటి వరకు ఎలా నాశనం చేశారో మనం చూశాం. కేంద్ర ప్రభుత్వం రాజధానికి ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చి బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు కేటాయించింది. అమరావతికి మళ్లీ మంచిరోజులు వచ్చాయనే ఆశ అందరిలో కనిపిస్తోంది. రాజధాని నిర్మాణం పూర్తయి ఉంటే దాదాపు రెండు, మూడు లక్షల కోట్ల రూపాయల ప్రజా సంపద వచ్చి ఉండేది. ఈ రోజు అప్పులు చేయాల్సిన అవస్థ తీరేది. టీడీపీ హయాంలో ఏపీ

- మిగతా 2 లో

ఢిల్లీకి జగన్

- నేడు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో ధర్నా
- అసెంబ్లీ, మండలి సమావేశాలకు వైసీపీ దూరం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీ నేతలతో కలిసి మంగళవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్నారు. రాష్ట్రంలో హింస, అరాచకాల కారణంగా శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని ఈనెల 25వ తేదీ బుధవారం ఢిల్లీలో వైసీపీ ధర్నా చేయనుంది. ఈ నిరసన కార్యక్రమంతో పాటు ఫొటోగ్యాలరీ ప్రదర్శన ఏర్పాటు చేశారు. దీని ద్వారా రాష్ట్రంలో 45 రోజులుగా కొనసాగుతున్న అకృత్యాలను వైసీపీ దేశ ప్రజల దృష్టికి తీసుకువెళ్లనుంది. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి గన్నవరానికి జగన్‌తో పాటు ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు చేరుకున్నారు. అక్కడి నుంచి ఢిల్లీకి పయనమయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 1,050 దాడులు, దౌర్జన్యాలు, 300 హత్యాయత్న ఘటనలు, 560 ప్రైవేట్ ఆస్తుల ధ్వంసం, 490 ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం అయినట్లుగా జగన్ చెబుతున్నారు. మరో 2,700 కుటుంబాలు ప్రాణ భయంతో ఊళ్లు వదిలి పారిపోయే పరిస్థితిని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని పేర్కొంటున్నారు. ఈ ధర్నా సందర్భంగా మూడు రోజులపాటు ఢిల్లీలోనే జగన్, ఆ పార్టీ నేతలు మకాం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నీట్ పరీక్ష మళ్లీ
అవసరం లేదు
సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: నీట్ ప్రశ్నపత్రం లీకైన మాట వాస్తవమేనని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. నీట్ అంశంపై విచారణ ముగియడంతో సీజేఐ ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. నీట్ మళ్లీ నిర్వహించాలన్న డిమాండ్‌ను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. జార్ఖండ్‌లోని హజారీబాగ్, బీహార్‌లోని పాట్నాలోని కేంద్రాల్లో నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్ కావడం వాస్తవమని, ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేస్తోందని, అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం దాదాపు 155 మంది లబ్ధిపొందినట్లు తెలుస్తోందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ వెల్లడించారు. పేపరు లీకేజీకి పాల్పడిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్ష పవిత్రత దెబ్బతిన్నదని చెప్పేందుకు సరైన ఆధారాలు లేవన్నారు. వ్యవస్థ

- మిగతా 2 లో

ఏపీ, బీహార్‌కు ప్రత్యేక నిధుల గాలం

హోదా ఇవ్వకుండా కుట్రపూరితంగా తప్పించుకున్న మోదీ

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్రత్యేక నిధుల గాలం వేసి తమ ఉచ్చులో నుంచి తప్పించుకోకుండా మోదీ సర్కార్ కుట్ర చేసింది. కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు పేర్కొంది. తమ అధికారం నిలబడాలంటే బీహార్, ఆంధ్రప్రదేశ్‌లోని జేడీ(యూ), టీడీపీ మద్దతు అనివార్యమైనందున మోదీ ప్రభుత్వం చాకచక్యంగా ప్రత్యేక నిధులతో మిత్రులను మెప్పించింది. ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని అమరావతిలో పారిశ్రామిక, మౌలిక అభివృద్ధి కోసం రూ.15వేల కోట్లు కేటాయించింది. బహుపాక్షిక అభివృద్ధి సంస్థల ద్వారా అదనపు ఆర్థిక సాయాన్ని అందిస్తామని కేంద్రం తెలిపింది. అటు బీహార్‌కు రూ.37,500 కోట్లను కేటాయించింది. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన దానికంటే ఎక్కువగా బీహార్ రాష్ట్రానికి ప్రకటించింది. మౌలికవసతుల ప్రాజెక్టులు, వరదల నియంత్రణ, నలంద, రాజ్‌గిరిలో పర్యాటకం-సంప్రదాయ సర్క్యూట్ అభివృద్ధి వంటి వాటికి ప్రత్యేక కేటాయింపులు వర్తిస్తాయి. రూ.26వేల కోట్ల ప్రత్యేక కేటాయింపును బహుళ మౌలికవసతుల ప్రాజెక్టులకు కేటాయించింది. అంతే కాకుండా వరద నిధిగా మరో రూ.11,500 కోట్లు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు ప్రత్యేక హోదాకు బదులు ప్రత్యేక నిధులు ఇవ్వడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.లక్షకోట్లకుపైగానే కోరగా బీహార్ రూ.30వేల కోట్లను డిమాండ్ చేశారు. బీహార్‌కు అడిగిన దానికంటే ఎక్కువగానే కేంద్రం ఇచ్చింది. తెలుగు రాష్ట్రానికి అడిగినదాంట్లో కనీసం పావువంతైనా ఇవ్వలేదు. బహుపాక్షిక అభివృద్ధి సంస్థల ద్వారా ఆర్థిక సాయం అంటూ ప్రకటించడంపై అనేక సందేశాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం నిధులు ఇస్తుందా లేక అప్పు ఇస్తుందా అన్నది ప్రశ్నార్థకమైంది. ఇదే సమయంలో ప్రత్యేక హోదా కోసం పట్టుపట్టకుండా నిధులతో సంతృప్తి చెందుతూ రాష్ట్ర ప్రయోజనాలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజీ పడుతుందన్న విమర్శలు వచ్చాయి. అన్ని రంగాలకు పెద్ద పీట వేసినట్లు ప్రకటించుకొని ప్రతిష్ఠాత్మకంగా బడ్జెట్‌ను కేంద్రప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టింది. ఆంధ్రప్రదేశ్, బీహార్‌ను మెప్పించేందుకు యత్నించింది. దీంతో ఆంధ్రప్రదేశ్, బీహార్ కోసమే బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు ఉన్నదని సామాజిక మాధ్యమాల్లో మీమ్స్ వైరలయ్యాయి. పూర్వోదయ పేరిట ప్రణాళికను బడ్జెట్‌లో భాగంగా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇందులో బీహార్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌పై దృష్టి పెడతామని చెప్పారు కానీ మొదటి రెండు రాష్ట్రాలకే పెద్ద పీట వేసినట్లుగా విమర్శలు వచ్చాయి. వాస్తవానికి ఈ రెండు రాష్ట్రాలు ప్రత్యేక హోదా కోసం దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నా కేంద్రం అందుకు అంగీకరించడం లేదు. ఏదో విధంగా తిప్పించుకుంటోంది. కాగా, సామాజిక-ఆర్థిక, భౌగోళిక సమస్యలు, సవాళ్లను బట్టి ప్రత్యేక హోదా అన్నది రాష్ట్రాలకు ఇస్తుంటారు. గత కొన్ని దశాబ్దాలుగా ప్రత్యేక హోదా పొందిన రాష్ట్రాలలో జమ్మూకశ్మీర్, అసోం, నాగాలాండ్, మేఘాలయ, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ ఉన్నాయి. అధికరణ 370, 371 కింద ప్రత్యేక హోదాను రాష్ట్రాలు పొందగలిగాయి. అయితే అధికరణ 370 రద్దుతో జమ్మూకశ్మీర్ ప్రత్యేక రాష్ట్ర హోదాను కోల్పోయిన విషయం విదితమే.

నీట్ పరీక్ష మళ్లీ అవసరం లేదు

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం నిర్వీర్యమైందని నిర్ధారణకు రావడం ప్రస్తుత దశలో కష్టమని, మళ్లీ పరీక్ష పెడితే 24 లక్షల మంది ఇబ్బంది పడతారని ఆయన పేర్కొన్నారు. వారిలో అనేకమంది వందల కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారని తెలిపారు. ఈ ఏడాది నీట్ ప్రవేశ పరీక్ష మే 5న దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో జరిగింది. దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు సాధించారు. హర్యానాలోని ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు తొలి ర్యాంక్ రావడంతో అనుమానాలు తలెత్తాయి. ఇంత మంది టాప్ ర్యాంకు పంచుకోవడం వెనుక గ్రేస్ మార్కులు కారణమని ఇటీవల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలోనే 'ఫిజిక్స్ వాలా' విద్యాసంస్థ వ్యవస్థాపకుడు అలఖ్ పాండేతో పాటు మరికొందరు దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు తాజాగా తీర్పు వెలువరించింది.

ఆ ప్రశ్నకు ఒకటే సమాధానం

కాగా, నీట్- యూజీ పరీక్షలో వచ్చిన ఓ ప్రశ్నపై ఐఐటీ-ఢిల్లీ నిపుణుల కమిటీ ఈ రోజు సుప్రీంకోర్టుకు నివేదిక అందించింది. ఆ ప్రశ్నకు రెండు కాదని, ఒకటే సమాధానం ఉందని వెల్లడించింది. భౌతికశాస్త్రానికి సంబంధించిన ఓ ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఇచ్చారని, మార్కులు ఒక్క దానికే వేశారంటూ నిన్నటి విచారణలో పిటిషనర్లు వాదించిన సంగతి తెలిసిందే. ఆ ప్రశ్నకు మార్కులు ఇచ్చినా, ఇవ్వకపోయినా మెరిట్ లిస్టు మారే అవకాశం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీం ధర్మాసనం... ఆ ప్రశ్నకు సరైన సమాధానం కోసం సంబంధిత సబ్జెక్టుకు చెందిన ముగ్గురు నిపుణులను ఏర్పాటుచేసి, ఈనెల 23వ తేదీ మధ్యాహ్నం లోపు దానిపై సమాధానం సమర్పించాలని ఐఐటీ- ఢిల్లీ డైరెక్టర్‌ను ఆదేశించింది. ఈ క్రమంలోనే నివేదిక సమర్పించింది.

అమరావతికి ఇక మంచి రోజులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాజధాని నిర్మాణానికి నిధులు ఏ రూపంలో వచ్చినా రాష్ట్రానికి మేలే జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై మీడియా వద్ద ఆయన స్పందించారు. తాము పెట్టిన ప్రతిపాదనలు చాలా వరకు కేంద్రం ఆమోదించిందని తెలిపారు. అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్ల ప్రత్యేక సాయాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలోనే అందిస్తాం. అవసరాన్ని బట్టి వివిధ ఏజెన్సీల ద్వారా మరిన్ని నిధులు కేటాయిస్తాం అని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఇచ్చిన హామీపై సీఎం స్పందిస్తూ, నిధులు ఏ రూపంలో వచ్చినా రాష్ట్రానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆర్థికంగా దెబ్బతిన్న ఏపీకి ఈ నిధులు ఎంతో ఉపయుక్తమని, రాజధాని నిర్మాణం పుంజుకోవాలంటే ఈ నిధులు ఎంతో ఉపయోగకరమన్నారు. ఏజెన్సీల నిధులు అప్పు రూపంలో అయినా 30 ఏళ్ల తర్వాతే తీర్చాల్సి ఉంటుందన్నారు. వివిధ ఏజెన్సీల నుంచి వచ్చే అప్పును కేంద్రం పూచీకత్తుతో ఇస్తుందని, దీనికి మరికొంత గ్రాంట్ కూడా కలిపి ఉంటుందని వివరించారు. కొంత కేంద్ర గ్రాంట్ క్యాపిటల్ అసిస్టెన్స్ రూపంలో కలుస్తుందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఇంతమేర నిధులు అని స్పష్టంగా బడ్జెట్‌లో పెట్టలేదని, పోలవరం పూర్తి చేసే బాధ్యత తమదేనని కేంద్రం చెప్పిందన్నారు. వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా సాయం ఉంటుందని సమాచారం ఉందన్నారు. ఈ ప్యాకేజీలో పారిశ్రామిక రాయితీలు కూడా వచ్చే అవకాశం ఉందని, నిబంధనలు పరిశీలించాక రాష్ట్రానికి అనుకూలంగా మలుచుకుంటామని చంద్రబాబు స్పష్టం చేశారు.

జగన్ నిర్వాకంతో బడ్జెట్ పెట్టలేని దుస్థితి

(మొదటిపేజీ తరువాయి)

జీవనాడి పోలవరం 72 శాతం పూర్తయింది. 2020-21 నాటికి పూర్తి కావాల్సిన ప్రాజెక్టును గోదావరిలో కలిపేశారు. కావాలని కాంట్రాక్టర్లను, అధికారులను మార్చడం, రివర్స్ టెండరింగ్‌కు వెళ్లడం చేశారు. వచ్చిన పరిశ్రమలను కూడా వెళ్లగొట్టారు. యువతకు ఉపాధి లేకుండా చేశారు. మరోపక్క ఇసుక, మద్యం వంటి వాటిలో రూ.లక్షల కోట్ల మేర దోపిడీ జరిగాయి. అసమర్థ నిర్ణయాలతో అభివృద్ధి లేక ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. 2019 నుంచి రాష్ట్ర వృద్ధి రేటు పడిపోయింది. మూలధనాన్ని 60 శాతం మేర తగ్గించారు. జలవనరులపై 56 శాతం, రోడ్లపై 85 శాతం మూలధనం తగ్గింది. రాష్ట్ర చరిత్రలో గత ఐదేళ్లు చీకటి రోజులుగా మిగిలిపోయాయి. రాష్ట్రంలో దాదాపు లక్షా 75 వేల ఎకరాల భూములు కబ్జా చేశారు. మెడపై కత్తిపెట్టి తమ పేరుపై భూములు రాయించుకున్నారు. దౌర్జన్యాలు, విధ్వంసాలు, కబ్జాలు, దాడులు, కేసులు ఎన్నో చూశాం. ప్రభుత్వ విధానాలపై ప్రశ్నించిన వారిని అనేకమందిని పొట్టన బెట్టుకున్నారు. కేసులు బనాయించి వేధించారు. అబద్ధాలతో విషప్రచారాలకు పాల్పడ్డారు. కోడికత్తి, గులకరాయి డ్రామాలు ఆడారు. వివేకా హత్య కేసు అనేక మలుపులు తిరిగింది. దేశంలో ఎక్కడాలేని విధంగా విచారణాధికారిపై కేసు పెడితే హైకోర్టుకు వెళ్లి బెయిల్ తీసుకునే పరిస్థితి. నేరస్తుడే సీఎం అయితే పోలీసులు కూడా వంత పాడే పరిస్థితి నెలకొంది. వివేకా హత్య కేసు నిందితుల అరెస్టుకు వెళ్లిన సీబీఐ సిబ్బందే వెనక్కి తిరిగి రావడం కూడా దేశంలో ఎక్కడా జరగలేదు.

చివరకు సొంత బాబాయిని ఎవరు చంపారో ఇంతవరకు తేలలేదు. హు కిల్డ్ బాబాయ్ అనే ప్రశ్నకు త్వరలోనే జవాబు వస్తుంది. ఇటువంటి అనేక ఘోరాలకు పాల్పడినవారు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ ఢిల్లీలో ధర్నా చేయడాన్ని చంద్రబాబు ఎద్దేవా చేశారు. ఈ నేపథ్యంలో మూడు పార్టీలు కలిశాక ఎవరూ ఊహించని ఫలితాలు వచ్చాయి. ఈ ఎన్నికల ఫలితాలు... రాష్ట్ర భవిష్యత్ కోసం ప్రజలిచ్చిన తీర్పు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే వరకు సమష్టిగా ముందుకెళతాం. ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో శాంతి భద్రతలు పరిరక్షించాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ఆదుకొని ఆర్థికంగా గాడీలో పెట్టాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా బలపడాలంటే ప్రత్యేక హోదా ద్వారానే సాధ్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చిత్తశుద్ధి ఉంటే బీహార్ జేడీయూ నేత నితీష్‌కుమార్ , వైసీపీ సహకారంతో ప్రత్యేక హోదా కోసం కేంద్రప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలన్నారు. ముచ్చుమర్రిలో బాలికపై అఘాయిత్యం చేసి హత్య చేయడం దారుణమన్నారు. నేటికి మృతదేహాన్ని పోలీసులు గుర్తించలేకపోయారన్నారు. అధికారం వచ్చిన తరువాత టీడీపీ వారు వైసీపీపై దాడులు చేస్తున్నారని ఇందుకు రాజంపేట ఎంపీపై దాడి నిదర్శనమన్నారు. సీనియర్ రాజకీయ వేత్తగా చంద్రబాబుపై రాష్ట్రంలో శాంతి భద్రతలు పరిరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. లేకుంటే రాష్ట్రంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడవలసి వస్తుందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడటంలో టీడీపీ ప్రభుత్వం విఫలం అయిందని వెంటనే రాష్ట్రపతి పాలన పెట్టాలని వైసీపీ నేత జగన్‌మోహన్‌రెడ్డి కోరడం సరైంది కాదన్నారు. రాజ్యాంగంపై నమ్మకం ఉన్న ఏపార్టీ రాష్ట్రపతి పాలన కోరదన్నారు. మదనపల్లెలో అగ్నిప్రమాదం కుట్రపూరితమైందని వెంటనే నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకులు జగన్నాథం, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునెప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజాసాహెబ్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.48.21 లక్షల కోట్లతో కేంద్ర బడ్జెట్

న్యూఢిల్లీ: దేశంలో తాండవిస్తున్న నిరుద్యోగం, ఉపాధిలేమి, అధిక ధరలతో రైతులు, అల్పాదాయ, మధ్యతరగతి వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలకు ఎటువంటి పరిష్కారాలు లేకుండానే కేంద్రంలోని ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తిస్థాయి బడ్జెట్ తీసుకొచ్చింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో రూ.48.21 లక్షల కోట్ల అంచనాతో కేంద్ర వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టారు. తొమ్మిది సూత్రాల ఆధారంగా బడ్జెట్ రూపకల్పన చేసినట్లు చెప్పారు. వ్యవసాయరంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన-నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన - ఆవిష్కరణలు, తయారీ, సేవలు, తదుపరి సంస్కరణలు... ఈ తొమ్మిది సూత్రాల ప్రాధాన్యంగా తీసుకుని బడ్జెట్ రూపొందించినట్లు తన ప్రసంగంలో నిర్మల ప్రకటించారు. వరుసగా ఏడోసారి వార్షిక పద్దును ప్రవేశపెట్టిన ఆమె గంటా 25 నిమిషాల పాటు ప్రసంగించారు. వికసిత్ భారత్ లక్ష్యసాధనలో భాగంగా అన్ని రంగాల్లో ఉద్యోగ, ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రూ. 48.21 లక్షల కోట్ల అంచనాల వార్షిక బడ్జెట్‌లో రెవెన్యూ రాబడులు 31.3లక్షల కోట్లుగా పేర్కొన్న ఆర్థిక మంత్రి, మూలధన రాబడులను రూ.16.9 లక్షల కోట్లుగా వివరించారు. రెవెన్యూ వ్యయాన్ని రూ.37.1 లక్షల కోట్లుగా పేర్కొన్న మంత్రి... మూలధన వ్యయం రూ.15లక్షల కోట్లుగా ప్రకటించారు. రెవెన్యూ లోటు జీడీపీలో 4.9 శాతంగా ఉంటుందని వివరించారు. బడ్జెట్‌లో అత్యధికంగా రక్షణ రంగానికి రూ.4,54,773 కోట్లు ప్రతిపాదించారు. తొమ్మిది ప్రాధాన్యాలను నెరవేర్చే దిశలో స్పష్టమైన మార్పులు కనిపించేలా ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు తెలిపారు. వచ్చే ఐదేళ్లలో సుమారు నాలుగు కోట్ల ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించిన మంత్రి సామాజిక న్యాయాన్ని బలోపేతం చేసేందుకు వివిధ చర్యలను ప్రతిపాదించారు. పట్టణాభివృద్ధి, ఇంధన భద్రతకూ పెద్దఎత్తున నిధులు కేటాయించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు చేశారు. నూతన ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధికి సంబంధించిన ప్రాధాన్యాలను వివరించిన మంత్రి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా భవిష్యత్ సంస్కరణలకు కూడా పెద్దపీట వేస్తామన్నారు.

మౌలికరంగంలో భారీగా పెట్టుబడులు

మౌలిక రంగంలో ప్రైవేటు పెట్టుబడులను భారీగా పెంచడమే లక్ష్యంగా బడ్జెట్‌లో చర్యలు చేపట్టినట్లు వివరించిన ఆర్థిక మంత్రి...మూలధన వ్యయం కింద రూ.11 లక్షల కోట్లు ప్రతిపాదించారు. మౌలిక రంగానికి ఆర్థికంగా పూర్తి భరోసా ఇస్తామన్న రాష్ట్రాలకు సైతం వాటి అభివృద్ధి ప్రాధాన్యాలకు అనుగుణంగా మద్దతు ఇస్తామని చెప్పారు. దీర్ఘకాలిక రుణాలకు వడ్డీ రాయితీలో భాగంగా లక్షా 50 వేల కోట్లు కేటాయించారు.

ఏపీ, బీహార్‌కు ప్రత్యేక ప్రాధాన్యం

కేంద్రంలో ఎన్డీఏ సంకీర్ణ సర్కారు ఏర్పాటులో టీడీపీ, జేడీయూ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆయా పార్టీలు అధికారంలో ఉన్న ఏపీ, బీహార్‌లకు కేంద్రం బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టం అమలుకు కట్టుబడి ఉన్నామని నిర్మల ఉద్ఘాటించారు. రాజధాని నగరంగా అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్ల ప్రత్యేక సాయం అందించడంతో పాటు పోలవరం ప్రాజెక్టును కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వెనకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇక బీహార్ రూ.26వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రకటించారు. జాతీయ రహదారుల అభివృద్ధి కోసమే రూ.20వేల కోట్లు కేటాయించనున్నట్లు ప్రకటించింది. పట్నా-పూర్ణియాలను కలుపుతూ ఎక్స్‌ప్రెస్‌వే అభివృద్ధి చేస్తామని పేర్కొంది. బక్సర్-భాగల్‌పూర్, బోధ్‌గయా-రాజ్‌గిర్-వైశాలీ-దర్భంగాలను అనుసంధానిస్తామని తెలిపింది.

తూర్పు రాష్ట్రాల కోసం 'పూర్వోదయ'

దేశంలో తూర్పు రాష్ట్రాల అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నామని తెలిపిన సీతారామన్... బీహార్, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ఇందులో భాగంగా మానవ వనరుల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ఆర్థిక అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించారు. మొత్తంగా పారిశ్రామిక కారిడార్‌ను అభివృద్ధి చేస్తామని, వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ ప్రాంతాన్ని ఓ ఇంజిన్‌గా మార్చడమే తమ ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. రంగాల వారీగా బడ్జెట్‌లో కేటాయింపులను నిర్మలా సీతారామన్ వివరించారు.

గృహ నిర్మాణానికి ఆర్థిక చేయూత

- వచ్చే ఐదేళ్లలో దేశంలోని పేద, మధ్యతరగతి వర్గాల అర్బన్ హౌసింగ్‌కు ఆర్థిక చేయూత అందించేందుకు రూ.2.2 లక్షల కోట్ల ప్యాకేజీని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇళ్ల నిర్మాణం కోసం తీసుకునే రుణాలపై వడ్డీ రాయితీని అందిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో దేశంలోని 30 లక్షలకుపైగా జనాభా కలిగిన నగరాల్లో 100 వారాంతపు అంగడ్లు (హాట్స్) నిర్మించేందుకు అవసరమైన మద్దతును ప్రత్యేక పథకం ద్వారా అందిస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు.
- ఇంటి అద్దెల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఇకపై 'ప్రాఫిట్స్ అండ్ గెయిన్స్ ఆఫ్ బిజినెస్ ఆర్ ప్రొఫెషన్' విభాగంలో పరిగణించరని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. వాటిని 'ఇన్‌కమ్ ఫ్రం హౌస్ ప్రాపర్టీ' అనే ప్రత్యేక విభాగంలో చేరుస్తారని వెల్లడించారు. స్థిరాస్తి క్రయ,విక్రయాలపై టీడీఎస్ విధించే అంశంపైనా కీలక నిర్ణయం తీసుకున్నారు. స్థిరాస్తిని విక్రయించే వ్యక్తుల సంఖ్య దాన్ని కొనుగోలు చేసే వ్యక్తుల సంఖ్య ఆధారంగా మొత్తం లావాదేవీపై టీడీఎస్‌ను ఇకపై విధిస్తారని నిర్మల ప్రకటించారు.

బినామీదారులకు మినహాయింపు

బినామీ ప్రాపర్టీ ట్రాన్సాక్షన్స్ నిషేధ చట్టం - 1988లోనూ కీలక సవరణలను కేంద్ర ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. బినామీదారుడిగా ఉన్న వ్యక్తి దర్యాప్తు సంస్థల ఎదుట నిజాన్ని ఒప్పుకుంటే జరిమానా, శిక్షల నుంచి మినహాయింపు కల్పించే నిబంధనను చట్టంలో చేరుస్తామని ఆమె ప్రతిపాదించారు.

మహిళల పేరిట ఆస్తులపై సుంకాల తగ్గింపు

మహిళల పేరిట కొనే ఆస్తులపై పన్నుల భారాన్ని తగ్గిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ విధానాన్ని దేశంలోని పట్టణ అభివృద్ధి పథకంలో భాగంగా మారుస్తామని తెలిపారు. ఈ దిశగా అన్ని రాష్ట్రాలను ప్రోత్సహిస్తామని నిర్మల ప్రకటించారు. మహిళల పేరిట కొనే ఆస్తులకు భారీ స్టాంపు డ్యూటీ బాదుడు నుంచి మినహాయింపు కల్పిస్తామన్నారు.

- ఉద్యోగాల్లో చేరే కొత్త ఉద్యోగులందరికీ ప్రభుత్వం ఒక నెల వేతనాన్ని ఇచ్చే మరో పథకాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఆ మొత్తాన్ని ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ కంట్రిబ్యూషన్‌గా అందజేస్తారు.ఈ పథకం అన్ని రంగాలలో ఉన్న సంస్థల్లో ఉద్యోగాల్లో చేరే వారికి వర్తించనుంది. దీంతో 210 లక్షల మంది యువతకు ప్రయోజనం కలుగుతుందన్నారు.

రాజకీయ ఒత్తిళ్లతోనే ఏపీ, బీహార్‌కు కేటాయింపులు: సీపీఎం

న్యూఢిల్లీ: నిరుద్యోగం, అధిక ధరలు, అసమానతలు, ప్రైవేటు పెట్టుబడులు తగ్గిపోవడం వంటి ఆర్థికపరమైన వాస్తవాలకు సుదూరంగా కేంద్ర బడ్జెట్ ఉందని సీపీఎం విమర్శించింది. తిరోగమన సంకుచితమైన ప్రతిపాదనలతో రూపొందిందని, గిమిక్కుల భరితంగా ఉందని మంగళవారం ఒక ప్రకటనలో సీపీఎం పొలిట్ బ్యూరో వ్యాఖ్యానించింది. 'కోఆపరేటివ్ ఫెడరలిజం' మాటలకే పరిమితమని పేర్కొంది. రాజకీయ ఒత్తిళ్లతోనే ఆంధ్రప్రదేశ్, బీహార్‌కు కేటాయింపులని వ్యాఖ్యానించింది. ఎన్డీయే ప్రభుత్వ మనుగడ మిత్రపక్షాలపై ఆధారపడి ఉందని, టీడీపీ, జేడీ(యూ) మెప్పించేందుకు బడ్జెట్‌లో ప్రయత్నాలు జరిగాయని పేర్కొంది. రాష్ట్రాలకు ఆర్థిక కమిషన్ కేటాయింపులు తగ్గాయని... 2022-23లో రూ.1,72,760 కోట్లు ఇవ్వగా 2023-24లో రూ.1,40,429, 2024-25లో రూ.1,32,378 కోట్లకు కేటాయింపులు తగ్గాయని ప్రకటన తెలిపింది.

ఏపీకి పరోక్ష ఊరట!

(మొదటిపేజీ తరువాయి)

ఎన్డీఏ ప్రభుత్వంలో ప్రస్తుతం టీడీపీ పాత్ర ప్రముఖంగా ఉండడంతో తప్పకుండా భారీ సహాయం లభించే అవకాశం ఉందని టీడీపీ, జనసేన నేతలు భావించారు. అయితే వీరు ఆశించిన మేర కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు పెద్దగా లేనప్పటికీ, పరోక్ష సహకారానికి హామీలు లభించాయి. అమరావతి రాజధాని నిర్మాణానికి, అభివృద్ధికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సహాయం వివిధ అభివృద్ధి ఏజెన్సీల ద్వారా ఇవ్వనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఆ తర్వాత కూడా అవసరాన్ని బట్టి భవిష్యత్‌లో మరిన్ని అదనపు నిధులు కేటాయిస్తామని చెప్పారు. విభజన చట్టానికి అనుగుణంగా పోలవరం ప్రాజెక్టు సత్వర నిర్మాణానికి సంపూర్ణ సాయం అందిస్తామని తెలిపారు. 'ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రైతులకు జీవనాడి పోలవరం. భారత ఆహార భద్రతకు ఆ ప్రాజెక్టు ఎంతో కీలకమైనది. పోలవరం నిర్మాణం సత్వరం జరిగేలా చూస్తాం' అని నిర్మలమ్మ భరోసానిచ్చారు. ఏపీలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. దీనిలో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాయలసీమలోని నాలుగు జిల్లాల సరసన రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ప్రకాశం జిల్లాను కూడా కలిపి ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు మంజూరు చేస్తామన్నారు. విభజన చట్టం ప్రకారం పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక సహకారం అందిస్తామని, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు అందిస్తామని తెలిపారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక సాయం చేస్తామన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, హైవేల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామన్నారు. విశాఖ-చెన్నై కారిడార్‌లో కొప్పర్తికి, హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌లో ఓర్వకల్లుకు నిధులు ఇస్తామని తెలిపారు. విదేశీ సంస్థల సాయంతో అమలయ్యే వివిధ ప్రాజెక్టుల కింద ఏపీకి నిధులు అందించనున్నారు. నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్, ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్, ఇంటర్నేషనల్ బ్యాంక్ ఫర్ రీ కన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ ద్వారా వివిధ ప్రాజెక్టుల కింద ఏపీకి సాయం అందించనున్నారు. ఆంధ్ర ప్రదేశ్ మండల్ కనెక్టివిటీ అండ్ రూరల్ కనెక్టివిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్ట్, ఆంధ్ర ప్రదేశ్ ఇరిగేషన్ అండ్ లైవ్లీహుడ్ ఇంప్రూమెంట్ ప్రాజెక్ట్, ఆంధ్ర ప్రదేశ్ రూరల్ రోడ్స్ ప్రాజెక్ట్స్, ఆంధ్ర ప్రదేశ్ రోడ్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్ట్, ఏపీ ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ అండ్ అగ్రికల్చరల్ ట్రాన్స్‌ఫార్మేషన్ ప్రాజెక్టులకు విదేశీ సంస్థల నుంచి సాయం అందనుంది. అలాగే కేంద్ర పన్నుల వాటా నుంచి రాష్ట్రానికి వచ్చే వాటాలోనూ పెరుగుదల ఉంటుందని మంత్రి తెలిపారు. దీని ప్రకారం 2024-25 సంవత్సరానికి సంబంధించి కేంద్రం పన్నుల్లో ఏపీ పన్నుల వాటా రూ.50,474 కోట్లు రానుంది. ఇదే సమయంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నష్టాల నుంచి గట్టెక్కించేందుకు రూ.620 కోట్లు కేటాయించారు. పూర్వోదయం పథకం కింద కూడా ఏపీకి సహాయం చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇలా మొత్తానికి ప్రత్యక్ష కేటాయింపులు పెద్దగా చేయకుండానే కేంద్రం వ్యూహాత్మకంగా సహాయం చేసినట్లుగా చెప్పుకుంటూ వివిధ అభివృద్ధి ఏజెన్సీల ద్వారా నిధులు ఇప్పించి, రాష్ట్రంపై మరింత అప్పుల భారాన్ని మోపే యత్నం చేసింది.

ఢిల్లీకి జగన్

(మొదటిపేజీ తరువాయి)

వేయనున్నారు. ఇప్పటికే రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోం మంత్రితో పాటు వివిధ మంత్రుల అపాయింట్‌మెంట్‌ను వైసీపీ కోరింది.

ఈనెల 22న ఢిల్లీలో హోం మంత్రి అమిత్ షాతో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రత్యక్షంగా భేటీ అయి... రాష్ట్రంలో నెలకొన్న హింసాత్మక పరిస్థితులను వివరించారు. వైసీపీ నేతలు, పార్టీ సానుభూతి పరుల హత్యలు, హింసాత్మక సంఘటనలపై రాష్ట్రపతికి, ప్రధానికి, హోం మంత్రికి వైసీపీ నేతలు ఫిర్యాదు చేయనున్నారు. ఏపీలో శాంతిభద్రతలు అదుపు తప్పిందనందున రాష్ట్రపతి పాలన విధించాలని వైసీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

అసెంబ్లీ, మండలి సమావేశాల సమయంలో ఢిల్లీకి జగన్

అసెంబ్లీ, శాసన మండలికి వైసీపీ సభ్యులు ఎవ్వరూ హాజరుకాకుండా ఢిల్లీకి పయనమయ్యారు. దీంతో రెండోరోజు అసెంబ్లీలో వైసీపీ సభ్యులు కనిపించలేదు. శాసన మండలిలోనూ ఆ పార్టీ సభ్యులు దూరంగా ఉన్నారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాల్సిన సమయంలో ఇలా జగన్ అసెంబ్లీకి వెళ్లకపోవడంపైనా విపక్షాలు విమర్శిస్తున్నాయి. అటు సొంత బాబాయి వివేకానంద రెడ్డి హత్యపై గానీ, ఏపీకి ప్రత్యేక హోదా అమలుపై గానీ ఢిల్లీలో ఇంతవరకు వైఎస్ జగన్ ఎందుకు ధర్నా చేయలేదంటూ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు షర్మిల సూటిగా ప్రశ్నించారు. ఇదే అంశాన్ని టీడీపీ నేతలు ఘాటుగా జగన్‌ను నిలదీస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో నిర్మాణాత్మకమైన సూచనలు చేయకుండా జగన్ ఢిల్లీకి వెళుతున్నారని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు.

మధ్యతరగతికి భరోసా: మోదీ

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగాల కల్పన జరుగుతుంది. కొత్త ఉద్యోగులకు తొలి జీతం మా ప్రభుత్వమే ఇస్తుంది. కోటి మందికి ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తున్నాం. ఇంటర్న్‌షిప్ ద్వారా గ్రామీణులకూ పెద్ద కంపెనీల్లో పనిచేసే అవకాశం ఉంటుంది' అని అన్నారు. 'బడ్జెట్‌లో నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేశాం. యువతరం కలలు నెరవేర్చే బడ్జెట్ ఇది. గ్రామం నుంచి మహా నగరం వరకూ అందర్నీ వ్యాపారవేత్తలను చేయడమే మా లక్ష్యం. ముద్రా రుణాల పరిధిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పెంచాం. భారత్‌ను గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చుతున్నాం. ఎంఎస్ఎంఈలకు రుణాలు అందించేందుకు కొత్త పథకం తీసుకొస్తున్నాం' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

కుర్చీ కాపాడుకోవడానికే

(మొదటిపేజీ తరువాయి)

ఎలాంటి ఉపశమనం లభించలేదని చెప్పారు. ఇదొక కాపీ పేస్ట్ బడ్జెట్ అని, కాంగ్రెస్ మేనిఫెస్టో, గత బడ్జెట్‌లు కాపీ కొట్టారని ఎక్స్ వేదికగా ఆయన విమర్శించారు.కూటమి భాగస్వాములను మోసం చేసేందుకు, ఎన్డీఏ మనుగడ సాగించేందుకు మోదీ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో అరకొర డబ్బులు పంచుతోందని ఆరోపించారు. ఇది దేశ ప్రగతికి ఉద్దేశించిన బడ్జెట్ కాదని, మోదీ ప్రభుత్వాన్ని కాపాడే బడ్జెట్ అని ఆరోపించారు.

కార్పొరేట్ల బడ్జెట్: సీపీఐ

(మొదటిపేజీ తరువాయి)

35 శాతానికి తగ్గించిన కేంద్రం...బడ్జెట్‌లో సామాన్యులకు మొండిచేయి చూపిందని విమర్శించింది. కార్పొరేట్ల లాభాలు నాలుగు రెట్లు పెరిగినప్పటికీ పన్నులు విధించకుండా తన విధేయతను ప్రభుత్వం చాటుకుంటోందని ప్రకటన పేర్కొంది. కార్పొరేట్ల కంటే సామాన్యులపై పన్నుల భారం అధికంగా ఉన్నదని పరోక్ష పన్నుల వాటా ద్వారా స్పష్టమైందని తెలిపింది. యువత, మహిళలు, పేదలు, రైతుల సమస్యలపై ప్రభుత్వం గోల చేస్తుంది తప్ప... వారి సంక్షేమానికి చర్యలు తీసుకోదని, కార్పొరేట్ల ప్రయోజనాలకే పరిమితమవుతున్నట్లు బడ్జెట్ ద్వారా మరోసారి రుజువైందని పేర్కొంది. ఎన్డీయే ప్రభుత్వ మనుగడపై బీజేపీకి నమ్మకం లేదని తేలిపోయిందని సీపీఐ వ్యాఖ్యానించింది.

'ఎన్డీయే ప్రభుత్వం అస్థిరంగా ఉందని కేంద్ర బడ్జెట్ చెప్పకనే చెబుతోంది. అధికారంలో కొనసాగేందుకు మద్దతిచ్చే బీహార్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మిత్రపక్షాలను మెప్పించే ప్రయత్నాలు బడ్జెట్‌లో కనిపించాయి. బీహార్, ఆంధ్రపదేశ్‌కు కేటాయింపులపై సీపీఐకు అభ్యతరం లేదు. కానీ కేరళ, తమిళనాడు, ఒడిశా వంటి రాష్ట్రాల న్యాయమైన డిమాండ్లను కేంద్రం విస్మరించడం ఆక్షేపణీయం. వరద సాయం కూడా ఇవ్వలేదు. కేంద్రం దృష్టిలో అన్ని రాష్ట్రాలు సమానంగా ఉండాలి. కేటాయింపులలో వివక్ష తగదు. ఉద్యోగ సృష్టిపై ప్రగల్భాలలో బీజేపీకి ఎవరూ సాటిరారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పనకు దశాబ్దం కిందట ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. అంటే ఇప్పటివరకు 20 కోట్ల ఉద్యోగాలు కల్పించాలి. కానీ 2024-25 బడ్జెట్‌లో కొత్త జుమ్లాలు వినిపించాయి. ఐదేళ్లలో 20 లక్షల యువకులకు నైపుణ్యత శిక్షణ ఇచ్చినట్లు, కోటి మందికి ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించినట్లు ప్రభుత్వం గొప్పలు పోయింది. వాస్తవానికి నిరుద్యోగం వల్ల యువత ప్రశాంతత కోల్పోయింది. బీజేపీ మాత్రం వాక్చాతుర్యం ప్రదర్శించుకోవడానికే పరిమితమైంది. విద్య, ఆరోగ్యం, సంక్షేమ పథకాల కోసం బడ్జెట్ కేటాయింపులలో స్తబ్ధత దర్శనమిచ్చింది' అని సీపీఐ పేర్కొంది.

హామీలతోనే సరి... నిధులేవీ?

కేంద్ర బడ్జెట్‌పై భిన్నస్వరాలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మాటలు ఘనం..నిధులు స్వల్పంగా కేటాయించారన్న విమర్శలు వచ్చాయి. బడ్జెట్‌లో రాష్ట్రానికి కీలకమైన ప్రత్యేక హోదా ప్రస్తావన లేకపోవడంపై రాజకీయ పార్టీలు తీవ్రంగా స్పందించాయి. విభజన చట్టాలను పూర్తిగా విస్మరించారని ధ్వజమెత్తాయి. రైతులకు, వ్యవసాయ కార్మికులకు, ఉద్యోగులకు, నిరుద్యోగులకు, ఉపాధి కూలీలకు ఈ బడ్జెట్ మేలు చేసేలా లేదని ప్రజాసంఘాలు విమర్శించాయి. బడ్జెట్‌లో అమరావతి రాజధానికి రూ.15 వేల కోట్ల కేటాయింపులను స్వాగతిస్తూ...వాటిని వివిధ ఏజెన్సీల ద్వారా నిధుల కేటాయింపు విధానాన్ని వ్యతిరేకిస్తున్నాయి. నేరుగా రాజధానికి రూ.15 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశాయి. బడ్జెట్‌లో పోలవరంతోపాటు మిగిలిన రైల్వేజోన్, కడప ఉక్కు, మెట్రో, విద్య, వైద్యసంస్థలు తదితర చట్టబద్ధమైన హామీలకు చోటు కల్పించకపోవడాన్ని తప్పుపడుతున్నాయి. అటు పోలవరం, అమరావతికి మంచి రోజులు వచ్చాయని అధికార టీడీపీ కూటమి హర్షం వ్యక్తం చేసింది.

అమరావతికి రూ.15 వేల కోట్లు నేరుగా ప్రకటించాలి: శ్రీనివాసరావు

అమరావతి రాజధానికి రూ.15 వేల కోట్లను వివిధ ఆర్థిక సంస్థల ద్వారా ఇప్పిస్తామని పేర్కొనడంతో రాష్ట్రానికి, రాజధానికి ఎలాంటి మేలు జరగబోదని

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. బడ్జెట్‌లో రాజధానికి రూ.15 వేల కోట్లను నేరుగా నిధులు ప్రకటించాలని, వివిధ సంస్థల ద్వారా అప్పుగా ఇప్పించడం రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతుందని అభిప్రాయపడ్డారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర ప్రజలకు తీవ్ర నిరాశ మిగిల్చారని, బడ్జెట్‌లో మాటలు ఘనం..నిధులు స్వల్పంగా కేటాయించారని పేర్కొన్నారు. భారీగా నిధులు వస్తాయని, విభజన చట్టంలోని అన్ని అంశాల అమలుకు నిధులు కేటాయిస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. ప్రత్యేక హోదా ఊసే లేదని, రైల్వేజోన్, కడప ఉక్కు, మెట్రో, విద్య, వైద్య సంస్థలు తదితర చట్టబద్ధమైన హామీలకు బడ్జెట్‌లో చోటు కల్పించలేదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, తెలుగుదేశం, జనసేన పార్టీలు కేంద్రంపైనా, బీజేపీపైనా రాజకీయ ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

అప్పుపై గొప్పలా: అంబటి రాంబాబు

కేంద్ర బడ్జెట్‌లో అమరావతికి రూ.15 వేల కోట్ల అప్పును వివిధ ఏజెన్సీ సంస్థల ద్వారా ఏర్పాటు

చేస్తామని కేంద్ర బడ్జెట్‌లో ప్రకటిస్తే... గొప్పలు చెప్పుకుంటున్నారని వైసీపీ నేత అంబటి రాంబాబు కూటమి ప్రభుత్వ నేతలపై విమర్శలు గుప్పించారు. సంపద సృష్టించడమంటే అప్పులు తెచ్చుకోవడం అన్నమాట అంటూ ఎక్స్ వేదికగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

హోదా ప్రస్తావన ఏదీ: షర్మిల

రాష్ట్రానికి ఇచ్చిన హామీలపై బడ్జెట్ ద్వారా దగా చేశారని, ప్రత్యేక హోదా ప్రస్తావనే బడ్జెట్‌లో లేదని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్ ఆధారంగా పార్లమెంట్ వేదికగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదని తేటతెల్లమైందన్నారు. ఏపీకి దాదాపు రూ.12 లక్షల కోట్లు కావాల్సి ఉందని, కానీ చంద్రబాబు అడిగింది కేవలం లక్ష కోట్లు మాత్రమేనని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో కేవలం రాజధానికి నిధులు ఇస్తామని ప్రకటించారని, పోలవరంపై ఎన్నో కబుర్లు చెప్పారని, నిధుల విషయం ప్రస్తావించలేదని ధ్వజమెత్తారు. పోలవరం ముంపు నిర్వాసితులకు పరిహారం రూ.12 వేల కోట్లు కావాలని, దానిపై బడ్జెట్‌లో ఏమీ చెప్పలేదన్నారు. బడ్జెట్‌పై చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు.

పోలవరం, అమరావతికి మంచి రోజులు: మంత్రి అచ్చెన్నాయుడు

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి

ప్రాధాన్యత ఇవ్వడం హర్షణీయమని రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వంలో పోలవరం, అమరావతికి మంచి రోజులు వచ్చాయని, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం, బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులు శుభ పరిణామమని పేర్కొన్నారు. అమరావతి రాజధాని అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయించడం, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు ఇస్తామనడంపై ఎన్డీఏ ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి అచ్చెన్నాయుడు ధన్యవాదాలు తెలిపారు.

ఏపీకి అన్ని విధాలా సాయం: పురందేశ్వరి

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అన్ని విధాలా కేంద్రం సాయమందిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి స్పష్టంచేశారు. ఏపీలో వెనుకబడిన 8 జిల్లాలకు కేంద్రం సహకారం అందిస్తుందన్నారు. రాయలసీమలోని నాలుగు, ఉత్తరాంధ్రంలోని 3 జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా గుర్తించి...ఏడాదికి రూ.50 కోట్లు చొప్పున ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేస్తామని తెలిపారు.

రైతాంగ ఆశలపై నీళ్లు చల్లిన కేంద్ర బడ్జెట్: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

రైతుల ఆశలపై నీళ్లు చల్లేలా కేంద్ర బడ్జెట్ ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన

కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ విమర్శించారు. బడ్జెట్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు మాత్రమే కేటాయింపులు చేపట్టారని పేర్కొన్నారు. దేశంలో 58 శాతం మంది ప్రజానీకం ఆధారపడిన వ్యవసాయరంగానికి కేటాయించిన బడ్జెట్ మొత్తం పరిశీలిస్తే కేవలం ఒక శాతం నిధులనూ వ్యవసాయరంగానికి కేటాయించలేదన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రూ.6 వేల నుంచి కనీసం రూ.10 వేలకు పెంచుతారని రైతులు ఆశించారని, వారి ఆశలపై బడ్జెట్ నీళ్లుచల్లిందన్నారు. రూ.5 లక్షల వరకు ఉన్న పంట రుణాలపై వసూలు చేస్తున్న 7 శాతం వడ్డీని పావలా వడ్డీగా మార్చే అంశంపై, రైతాంగానికి వృద్ధాప్య పెన్షన్ ప్రకటించే ఆంశంగానీ బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు.

ఉద్యోగస్తులను ఉసూరునిపించిన బడ్జెట్: ఎస్టీయూ

పాత పన్ను విధానంలో కొనసాగుతున్న మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులకు కేంద్ర బడ్జెట్ ఉసూరుమనిపించిందని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, మల్లు రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పదేళ్లుగా ఆదాయపు పన్ను మినహాయింపు రూ.2.5 లక్షలకే పరిమితమైందని తెలిపారు. ఒకవైపు రూ.8 లక్షల లోపు ఆదాయం కలవారిని ఆర్థికంగా వెనుకబడిన వారిగానే పరిగణిస్తూ, మరోవైపు రూ.2.5 లక్షల ఆదాయం దాటిన వారి నుంచి పన్ను వసూలు చేయడం దుర్మార్గ చర్యని, వెంటనే ఎనిమిది లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగులకు చివరివేతనంలో 50 శాతం పెన్షన్ వచ్చేలా చేస్తామన్న హామీపై బడ్జెట్‌లో ప్రస్తావన లేదన్నారు.

ఉపాధి హామీ చట్టానికి తూట్లు: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం

కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ కూలీలకు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఉప ప్రధానకార్యదర్శి ఆర్.వెంకట్రావు తెలిపారు. ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో కేవలం రూ.6 వేల కోట్లు మాత్రమే కేటాయింపులు చేయడంపై ఆగ్రహం వెలిబుచ్చారు. కేంద్ర బడ్జెట్‌లో రూ.4 లక్షల 20 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం మొక్కుబడిగా కేటాయింపులు చేయడం బాధాకరమన్నారు. ఇది పేద వర్గాలను మోసగించడమేనని పేర్కొన్నారు. ఇప్పటికే అతివృష్టి, అనావృష్టి వల్ల వ్యవసాయ కూలీలు యేటా వలస పోతున్నారని, ఉపాధి హామీ చట్టం పనులు ఎంతో కొంత కూలీలకు ఉపశమనం ఇస్తున్నాయని, అలాంటి చట్టానికి తూట్లు పొడవడం బీజేపీకి పేదల పట్ల ప్రేమలేకపోవడమేనని తెలిపారు.

పంచాయతీ నిధుల దారిమళ్లింపుపై విచారణ

శాసన మండలిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: పంచాయతీలకు 14వ, 15 ఆర్థిక సంఘం కింద విడుదల చేసిన నిధుల దారిమళ్లింపు, అవకతవకలపై కమిషన్ వేసి విచారణకు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. కేంద్ర ఆర్థిక కమిషన్ విడుదల చేసిన నిధుల్లో మళ్లింపు జరిగిందన్న విషయాన్ని తాము గుర్తించామన్నారు. శాసన మండలిలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఆర్థిక సంఘం నిధుల మళ్లింపు అంశంపై ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, తిరుమల నాయుడు, పంచుమర్తి అనురాధ, కంచర్ల శ్రీకాంత్ తదితరులు ప్రశ్నించారు. అసలు పంచాయతీ నిధులను గత ప్రభుత్వ హయాంలో మళ్లించారా? లేదా?... నిధులు మళ్లించినట్లయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో తీసుకుంటున్న చర్యలేమిటని అడిగారు. ఆయా సభ్యులు అడిగిన ప్రశ్నలకు పవన్ కల్యాణ్ బదులిచ్చారు. కేంద్ర ఆర్థిక కమిషన్ నిధులు విడుదల చేసినప్పటికీ, పంచాయతీరాజ్ సంస్థలకు రూ.998 కోట్లు ఇంకా విడుదలకు నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో 13,371 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం కేవలం ఐదు పంచాయతీలనే సందర్శించిందని వివరించారు. దీంతో క్షేత్రస్థాయి వాస్తవికతను, తప్పుడు నిర్ధారణలకు వచ్చే ప్రమాదాలను సరిగ్గా అంచనా వేయడానికి సరిపోదన్నారు. గ్రామ పంచాయతీల కార్యదర్శులు సమీప గ్రామ వార్డు సచివాలయం విధుల్లోకి వెళ్లడం సరికాదని, దీనిపై తాము విధానపరమైన నిర్ణయం తీసుకుంటామన్నారు. పంచాయతీలకు చెందిన కార్యదర్శులు..అక్కడే విధులు నిర్వహించేలా చూస్తామన్నారు. ఆర్థిక సంఘం మార్గదర్శకాల ప్రకారం గ్రామ పంచాయతీలకు విడుదల చేసిన నిధులను తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర కార్యకలాపాలకు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అలాంటికి జరగలేదని గుర్తించినట్లు చెప్పారు. కేంద్రం నుంచి సకాలంలో రాష్ట్రానికి నిధులు చేరినప్పటికీ, వాటిని పంచాయతీలకు జమ చేయడంలో ఆలస్యం జరిగిందని వివరించారు. భవిష్యత్‌లో ఇలాంటి తప్పిదాలు కొనసాగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అధిక నిధులతో రాష్ట్రాన్ని ఆదుకోవాలి

డేగా ప్రభాకర్

విశాలాంధ్ర–అమలాపురం: అమలాపురంలో ఈనెల 27న సీపీఐ అంబేద్కర్ కోనసీమ జిల్లా సమితి సమావేశం జరుగుతుందని, ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతారని పార్టీ జిల్లా ఇన్‌ఛార్జ్ డేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు తెలిపారు. మంగళవారం అమలాపురం బండివారిపేట అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో జరిగిన పార్టీ విస్తృత సమావేశంలో వారు మాట్లాడుతూ 27వ తేదీన జరిగే సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వర్షాలు, వరదల వలన నష్టపోయిన ఇళ్లకు, రైతులకు, ప్రజలకు నష్టపరిహారం ఇవ్వాలని, బడ్జెట్‌లో కేంద్రం అధిక నిధులు కేటాయించి రాష్ట్రాన్ని ఆదుకోవాలని, కోటిపల్లి, నరసాపురం రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాలని, వ్యాపారస్తులకు, ప్రజలకు అనుకూలంగా వ్యాపార సంస్థలు, షాపులు రాత్రి 11 గంటల వరకు తెరిచి ఉంచేలా అధికారులు సహకరించాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవ రాజేంద్ర ప్రసాద్, పి.రాము, కొండే రామకృష్ణ, శీలం వెంకటేష్, సానబోయిన మనోహర్, జనుపల్లి చిరంజీవి, సమితి సభ్యులు వై.వెంకట్, సఖిలే శ్రీను, గెడ్డం ప్రభాకర రావు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీ ప్రగతికి ఐక్యకృషి

జంగాల అజయ్ పిలుపు

విశాలాంధ్ర–గుంటూరు కలెక్టరేట్: కమ్యూనిస్టు పార్టీ ప్రగతికి ఐక్యంగా కృషిచేయాలని సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో సీపీఐ నగర సమితి సభ్యుల విస్తృత సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి నగర కార్యవర్గ సభ్యులు గుండెబోయిన లక్ష్మి అధ్యక్షత వహించారు. జంగాల అజయ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని, మౌలిక సమస్యలు అపరిష్కృతంగా మిగిలాయన్నారు. పారిశుద్ధ్యం లోపించి డయోరియా, డెంగ్యూ, మలేరియా వంటి రోగాలు ప్రబలుతున్నాయని అన్నారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులకు అనేకసార్లు మొరపెట్టుకున్న ఫలితం ఉండటం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రాభివృద్ధి, అపరిష్కృత సమస్యలపై కొత్త ప్రభుత్వం దృష్టి పెట్టడం ఎంతైనా అవసరమని అన్నారు. సమస్యల పరిష్కారానికి సీపీఐ శాఖాపరంగా చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రతి ప్రాంతంలో ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు. మోదీ ప్రభుత్వ విధానాలతో దేశ సౌభ్రాతృత్వం ప్రమాదంలో పడిందని, దీనికి వ్యతిరేకంగా జరిగే పోరులో సీపీఐ శ్రేణులు విరోచిత పాత్ర పోషించాలని జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సీపీఐ నగర కార్యదర్శి కోటమాల్యాద్రి మాట్లాడుతూ పోరాటాలతోనే గుంటూరు సమగ్రాభివృద్ధి సాధ్యమని, ఇందుకు సిద్ధం కావాలన్నారు.

ప్రతిపక్ష హోదా ఇవ్వండి

హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ అధినేత జగన్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్ర అసెంబ్లీలో వైసీపీకి ప్రతిపక్ష హోదాపై ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. తనకు ప్రతిపక్ష హోదా ఇచ్చేలా అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని ఆదేశించాలని జగన్ కోరారు. ఇప్పటికే ప్రతిపక్ష హోదా కోసం స్పీకర్‌కు లేఖ రాసినప్పటికీ...ఆయన స్పందించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. అసెంబ్లీ కార్యదర్శిని, శాసనసభ వ్యవహారాల మంత్రిని ప్రతివాదులుగా చేర్చారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైంది. కేవలం 11 సీట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. వైసీపీకి ఉన్న సంఖ్యాబలం ఆధారంగా ప్రతిపక్ష హోదా కుదరదని అధికార కూటమి నేతలు చెబుతున్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా లేకపోవడంతో జగన్‌కు పూర్తిగా భద్రతను తొలగించారు. ప్రస్తుతం జగన్‌కు ఎమ్మెల్యే స్థాయిలోనే భద్రతను కేటాయించారని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

కేంద్ర బడ్జెట్‌పై విశాఖలో సీపీఐ నిరసన

విశాలాంధ్ర – విశాఖ: రాష్ట్రానికి కేంద్రం మరోసారి మొండి చేయి చూపించిందని సీపీఐ విశాఖ జిల్లా సమితి విమర్శించింది. పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రతిపాదనల్లో ఆంధ్రప్రదేశ్‌కి తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొంది. ఈ బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఐ శ్రేణులు విశాఖ రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద మంగళవారం సాయంత్రం నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ రూ.47.65 లక్షల కోట్ల అంచనాతో ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయించినట్టు చెబుతున్నా అది నమ్మశక్యం కాదని అన్నారు. అత్యంత ముఖ్యమైన పోలవరం ప్రాజెక్టు కోసం ఒక్క రూపాయి కేటాయింపు లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 2019 ఎన్నికల ప్రచార సభలో విశాఖలోనే స్వయంగా ప్రధానమంత్రి విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని చేసిన ప్రకటన నేటికీ కార్యరూపం దాల్చలేదని అన్నారు. ఈ బడ్జెట్ లో కూడా నిధులు, విధుల గురించి ప్రకటన చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. విశాఖపట్నం ఉక్కు కర్మాగారం ప్రైవేటుపరం కాకుండా కాపాడుతామనిగానీ, సెయిల్ లో విలీనం చేస్తామనిగానీ ప్రకటించకపోవడం మరోసారి ఆంధ్రప్రదేశ్‌ని ముఖ్యంగా ఉత్తరాంధ్రని మోసం చేయడమేనని విమర్శించారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక నిధులు ఇచ్చి ఆదుకుంటామని హామీల ద్వారా మరొకసారి మభ్యపెట్టాలని చూస్తున్నారని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్‌కే రెహమాన్, పి చంద్రశేఖర్, ఆర్ శ్రీనివాసరావు నాయకులు జేడీ నాయుడు, ఎన్ నాగభూషణం, వై రాంబాబు, ఎస్ శ్రీనివాస్, సీహెచ్ కాసుబాబు, ఎ ఆదినారాయణ, ఎం శ్రీనివాసరావు, కె తిరుపతిరావు, వి నల్లయ్య పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలి: ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర–విజయవాడ: అవినీతికి పాల్ప డుతూ, ఉపాధ్యాయ నియామకాలలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ప్రిన్సిపల్ వసుంధర దేవిని సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. వారు మంగళవారం విజయవాడలోని బీసీ గురుకుల రెసిడెన్షియల్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్‌ను కలిశారు. ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలంటూ వినతిపత్రాన్ని అందజేశారు. నంద్యాల జిల్లా, డోన్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే మహిళ బీసీ గురుకులంలో డొనేషన్ పేరుతో అవినీతి సాగుతోందని ఆరోపించారు. అందుకు సంబంధించిన ఆధారాలను కృష్ణమోహన్‌కు అందజేశారు. ప్రిన్సిపల్ వసుంధర దేవిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, సహాయ కార్యదర్శి వలరాజు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు సూర్య ప్రతాప్ విలేకరులతో మాట్లాడుతూ ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు డొనేషన్ల పేరిట రూ.10వేల నుంచి రూ.25వేల వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రిన్సిపల్ వసుంధర దేవి నియంతలా వ్యవహరిస్తున్నారని, ఆమెను వెంటనే విధుల నుంచి తొలగించాలని కృష్ణమోహన్‌ను కోరినట్లు చెప్పారు. సమగ్ర విచారణ జరిపించి, అవినీతి జరిగినట్లు తేలితే ఆమెపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర సహాయ కార్యదర్శి అయ్యప్ప కూడా పాల్గొన్నారు.

రైతు ఆదాయం రెట్టింపు చర్యలేవి?

ఏఐకేఎస్ నేతలు క్షీరసాగర్, వెంకయ్య

విశాలాంధ్ర–హైదరాబాద్: 2024 -25 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రతిపాదించిన బడ్జెట్ రైతు వ్యతిరేక బడ్జెట్‌లా ఉన్నదని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షులు రాజన్ క్షీరసాగర్, ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య ఒక ప్రకటనలో విమర్శించారు. వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసినట్టుగా, 9 ప్రాధాన్యత రంగాల్లో మొదటి ప్రాధాన్యత రంగంగా వ్యవసాయ రంగాన్ని సూచించారనీ, అయితే వ్యవసాయ రంగానికి కేవలం 1.52 లక్షల కోట్లు మాత్రమే కేటాయించడం మోదీ ప్రభుత్వ రైతు వంచనకు కొలమానంగా ఉందన్నారు. దేశంలో వ్యవసాయం మీద ఆధారపడే జనాభా 60 శాతానికి పైగానే ఉన్నారనీ, రైతులకు బడ్జెట్ లో 3 శాతం కూడా కేటాయించకుండా ప్రాధాన్యత ఎలా ఇచ్చినట్టో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని నిలదీశారు. మద్దతు ధరలు బాగా పెంచుతామన్నారు. బాగా అంటే ఎంత? సి (కాపిటల్) 2 ప్లస్ 50 అని చెప్పిన డాక్టర్ స్వామినాథన్ కమిషన్ ఊసేలేదన్నారు. మద్దతు ధరలకు వ్యాపారస్తులు కొనకపోతే ప్రభుత్వం కొనేందుకు ఎలాంటి కేటాయింపులు బడ్జెట్‌లో లేవు. లక్ష కోట్ల ధరల స్థిరీకరణ నిధి కేటాయించాలని రైతు సంఘాలు కోరుతున్నాయి, వ్యవసాయ ఆదాయాన్ని 50శాతం లాభసాటిగా పెంచుతామంటున్నారు. గతంలో వ్యవసాయ ఆదాయన్ని రెట్టింపు చేస్తామని వట్టి మాటలతోనే కాలక్షేపం చేశారు. ఇది కూడా అలాంటి ప్రక్రియగానే మిగలనుంది. పప్పు ధాన్యాలైన కందులు, పెసలు, సెనగలు లాంటి పంటలకు అధిక ప్రాధాన్యత ఇస్తామంటున్నారు. నూనె గింజలు అయిన వేరుసెనగ, పొద్దుతిరుగుడు, నువ్వులకు పెద్ద పీట వేశామన్నారు. అయితే ఈ రంగాలకు బడ్జెట్‌లో నిర్దిష్టమైన కేటాయింపులు లేవు. సేంద్రియ వ్యవసాయానికి కోటి మందిని ప్రోత్సహిస్తామని ఆర్భాటంగా ప్రకటించారు కానీ అందుకు నిర్దిష్టమైన కేటాయింపులు బడ్జెట్ లో లేనేలేవన్నారు. అప్పుల భారంతో ఆత్మ హత్యలు చేసుకుంటున్న లక్షలాది రైతులకు రుణమాఫి అంశాన్ని బడ్జెట్ ప్రసంగంలో అసలు ప్రస్తావించలేదు. దేశంలోని రైతు సంఘాలన్నీ ముక్త కంఠంతో కేరళ తరహా రుణ విమోచన చట్ట బద్ధ హక్కుగా కావాలని పోరాడుతూనే ఉన్నాయనీ, ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయాన్ని మొదటి స్థానంలో పెట్టినప్పటికీ ఆచరణలో చివరి స్థానంలోకి నెట్టినట్టుగా భావించాల్సి ఉందన్నారు. అందుకని రైతు వ్యతిరేక బడ్జెట్‌ను రైతు సంఘాలన్నీ నిరసించాలని ఆ ప్రకటనలో రావుల వెంకయ్య కోరారు.

50 ఏళ్లకే పెన్షన్ ఇస్తాం

- ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీలకు...
- ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీల పెన్షన్‌పై ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించనుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. శాసన మండలిలో సభ్యులు రాజగొల్ల రమేశ్ యాదవ్, బొమ్మి ఇజ్రాయేల్, కవురు శ్రీనివాస్ తదితరులు అడిగి ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పెన్షన్ పథకం అత్యంత ప్రధానమైనదని, అన్ని వర్గాల సంక్షేమ, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలో జారీజేసిన హామీ ప్రకారం సీఎం చంద్రబాబు పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే 3వ సంతకం పెన్షన్‌పై పెట్టారన్నారు. గతంలో రూ.3 వేలు ఉన్న పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచి అమలు ప్రారంభించామని వివరించారు. అన్ని విభాగాల సామాజిక భద్రత పెన్షన్లకు సంబంధించి మొత్తం వ్యయం నెలకు రూ.1,939.37 కోట్ల నుంచి రూ.2,759.31 కోట్లకు పెరిగిందని వివరించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో వార్షిక బడ్జెట్ రూ.23,272.44 కోట్ల నుంచి రూ.33,099.72 కోట్లకు పెరిగిందని వివరించారు. గత ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ పెన్షన్ల పంపిణీ సాధ్యంకాదని చెప్పగా, కూటమి ప్రభుత్వ హయాంలో వారి ద్వారా ఇంటింటికీ పెన్షన్లు పంపిణీ చేశామన్నారు. మొత్తం 65,18,496 పెన్షన్లలో 64,58,380 పెన్షన్లను (99.08 శాతం) ఇంటి వద్దకే సమర్థవంతంగా పంపిణీ చేశామని తెలిపారు.

జాతీయ రహదారుల పనులపై సమగ్ర దర్యాప్తు : ఆర్అండ్‌బి మంత్రి జనార్దన్ రెడ్డి

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన జాతీయ, రాష్ట్ర రహదారుల పనుల అవకతవల ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేయిస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జాతీయ, రాష్ట్ర రహదారుల పనుల్లో అవినీతి, అవకతవకలు జరిగాయంటూ ప్రభుత్వం దృష్టికి వచ్చినది వాస్తవమేనా? అని ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రామగోపాలరెడ్డి, బి.తిరుమలనాయుడు, కంచర్ల శ్రీకాంత్, పంచుమర్తి అనురాధ తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి జవాబిచ్చారు. తమ దృష్టికి అనేక ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వాటిని రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు, న్యూఢిల్లీలోని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ కార్యదర్శికి పంపామని వివరించారు. సంబంధిత విచారణ అధికారుల ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తిరుమలలో అక్రమాలను ఉపేక్షించం

మంత్రి ఆనం

విశాలాంధ్ర–విజయవాడ: తిరుమలలో అక్రమాలకు ప్పాలడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామానారాయణరెడ్డి హెచ్చరించారు. శాసనపరిషత్ సమావేశాల్లో భాగంగా తిరుమాలలో అక్రమాలపై ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, దువ్వారపు రామారావు, పంచుమర్తి అనురాధ, బి.తిరుమల నాయుడు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. అవినీతి, అక్రమాలపై విచారణ సాగుతోందని ఆనం రామానారాయణ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ టి.కల్పలత... మహిళల్లో కేన్సర్‌ను అరికట్టేందుకు తీసుకునే చర్యలపై ప్రశ్నించగా మూడు రకాల కేన్సర్‌లను గుర్తించేందుకు ఆగస్టు 15 నుంచి సమగ్ర వార్షిక స్క్రీనింగ్ నిర్వహణ, మరణాల నివారణపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇందుకోసం ఫీల్డ్ హెల్త్ వర్కర్లకు సంబంధిత శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

సంపాదకీయం

నమ్మకం కలిగించని బడ్జెట్

నిరుద్యోగం, ధరల పెరుగుదల, సమాజంలో కొంత మంది కుబేరులై పోవడం, అత్యధిక శాతం ప్రజలు బతుకీడ్వడమే కష్టం అయిపోతున్న సమయంలోనూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఏ మాత్రం ఊరట కలిగించలేదు. అక్కడక్కడా చిన్న చిన్న సదుపాయాలు మాత్రం కల్పించారు. కొత్త పన్నుల విధానాన్ని అనుసరించే వారికి రూ. 17.5000 కోట్లు మిగులుతాయని ఆర్థిక మంత్రి అంటున్నారు. ఈ బడ్జెట్‌లో కొట్టొచ్చినట్టు కనిపించే అంశం ఏమిటంటే గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం అనుసరించిన కార్పొరేట్లకు దోచి పెట్టే విధానాన్ని యథాతథంగా కొనసాగించడమే. కార్పొరేట్ సంస్థల మీద ఉన్న ప్రేమాభిమానాలు సామాన్య జనం మీద ఎంతమాత్రం లేవని నిర్మలా సీతారామన్ ఏడోసారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మొహమాట పడకుండా నిరూపించారు. మోదీ ప్రభుత్వం ఎవరి పక్షాన నిలబడుతుందో మరోసారి రుజువు అయింది. ఉపాధి అవకాశాలు పెంచడానికి తీసుకున్న నిర్దిష్టమైన చర్యలు ఏవీ నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో వినిపించనే లేదు. ఈ బడ్జెట్‌లో ద్యోతకం అయ్యేదల్లా గత పదేళ్ల వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి ప్రయత్నం చేయడమే. బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలకు ముసుగు కప్పడంలో నిర్మలా సీతారామన్ అద్భుతమైన కౌశలం ప్రదర్శించారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర చాలా ఏళ్లుగా తగ్గుతూనే ఉంది. అలాంటి సమయంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను అంచెలంచలుగా సామాన్యుల నడ్డివిరిచే స్థాయికి వెళ్లినా ఈ భారం తగ్గించడానికి చేసింది ఏమీలేదు. ముడి చమురు ధరలు తగ్గినప్పుడు జనంమీద భారం తగ్గించి అభివృద్ధి కార్యకలాపాలకు ఊతం ఇవ్వాలన్న ధ్యాస మోదీ ప్రభుత్వానికి ఎన్నడూ లేదు కనక ఈ బడ్జెట్‌లో సామాన్యులకు ఉపశమనం కలుగుతుందని ఆశించడం దండగ. లోక్‌సభలో మొహం వాచిపోయిన మోదీ ప్రభుత్వం తెలుగుదేశం, జె.డి.(యు) పార్టీల మద్దతుతో మనుగడ కొనసాగిస్తోంది. అంటే మోదీ ప్రభుత్వం కొయ్య కాళ్ల మీద ఆధారపడక తప్పని పరిస్థితి. పోనీ ఆపత్కాలంలో తమను ఆదుకున్న ఆ రెండు పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు దోచిపెట్టింది ఏమైనా ఉందా అంటే లేదు. అమరావతిలో రాజధాని నిర్మాణానికి రూ.లక్ష కోట్లు కావాలని అంచనా. పదేళ్ల నుంచి, ముఖ్యంగా వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అమరావతిలో రాజధాని నిర్మాణం పూర్తిగా కుంటుపడింది. అమరావతిలో రాజధాని నిర్మాణం చంద్రబాబు నాయుడు దీర్ఘ కాలిక కల. రాజధాని నిర్మాణానికి రాష్ట్ర విభజన తరవాత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శంకుస్థాపన చేసింది సాక్షాత్తు ప్రధాన మంత్రి మోదీనే. కాని అప్పుడు ఆయన ఇచ్చింది పిడికెడు మట్టి, చెంబెడు నీళ్లు మాత్రమే. ఇప్పుడు తెలుగు దేశం మద్దతు ఎంత అవసరమైనా రూ. 15,000 కోట్లు ఇస్తామనడం లేదు. ఇప్పిస్తామంటున్నారు. అంటే బడ్జెట్‌లో అమరావతి నిర్మాణం కోసం ప్రత్యేకంగా నిధులేమీ కేటాయించలేదు. ఆ 15,000 కోట్లు రుణాల రూపంలో ఇప్పిస్తామన్నది నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో దాగిన అసలు సత్యం. బీహార్‌కో, ఆంధ్రప్రదేశ్ కో నిధులు కేటాయిస్తే అభ్యంతర పెట్టవలసిన పనిలేదు. కాని కేరళ, తమిళనాడు, ఒడిశా కూడా వరద బాధితులను ఆదుకోవడానికి ప్రత్యేక కేటాయింపు అడుగుతున్నా ఆర్థిక మంత్రి కిమ్మనలేదు. నిధుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపించకూడదు. ఒక్క ఒడిశాను మినహాయిస్తే తమిళనాడు, కేరళ ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి. ప్రతిపక్ష రాష్ట్రాలకు నిధులు కేటాయించడానికి నిర్మలా సీతారామన్‌కు ఇప్పటిదాకా మనసు ఒప్పలేదు. రాష్ట్రాల ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలన్న ఆలోచనే లేదు. నిష్పక్షపాతంగా నిధులు కేటాయించడానికి ఉపకరించిన ప్రణాళికా సంఘాన్ని మోదీ సర్కారు తోసి పారేసింది. దాని స్థానంలో ఏర్పాటు అయిన నీతి ఆయోగ్ వల్ల అవసరమైన రాష్ట్రాల అవసరాలు తీరిన సందర్భమే లేదు.

2014లో అధికారంలోకి రావడానికి మోదీ ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని వాగ్దానం చేశారు. ఆ మాట అనంత వాయువుల్లో కలిసి పోయింది. ఇప్పుడు కొత్త నాటకం మొదలెట్టారు. 20 లక్షల మందికి నైపుణ్యాభివృద్ధి కలిగిస్తారట. ఒక కోటి మందికి ఉద్యోగాలు కల్పిస్తామనడం లేదు. కానీ శిక్షణ ఇప్పిస్తారట. ఈ రెండు పనులూ చేయడానికి అయిదేళ్లు పడ్తుంది. ఉద్యోగాలు లేక అనేక మంది విద్యార్హత ఉన్నవారు కూడా వందలు, వేలు ఖాళీలు ప్రకటిస్తే లక్షల సంఖ్యలో దరఖాస్తులు పెట్టుకుంటున్న దుస్థితిలో ఉన్నాం. నిరుద్యోగ సమస్య తీవ్రతను తగ్గించే ప్రయత్నం ఈ బడ్జెట్‌లో పూజ్యం. అలాంటి దిశగా బడ్జెట్ ప్రసంగంలో ఒకటో రెండో మాటలు దొర్లినా గతానుభవంతో చూస్తే అవీ బూటకపు వాగ్దానాలేనని తేలక తప్పదు. విద్య, ఆరోగ్యం లాంటి సాంఘిక సంక్షేమానికి కేటాయించే నిధులు ఇసుమంత కూడా పెరగలేదు. కార్పొరేట్ సంస్థల లాభాలు అంతకంతకూ పెరుగుతున్నా రాయితీలు దక్కుతున్నది ఆ సంస్థలకే. సామాన్యులు నోట్లో తడి ఆరిపోతుంటే ఎదురుచూస్తూ ఉండాల్సిందే. కార్పొరేట్ సంస్థలు చెల్లించే పన్నుల వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కన్నా ఆదాయపు పన్ను, మరి కొన్ని పరోక్ష పన్నుల ద్వారా సమకూరే రాబడే ఎక్కువ అంటే ఈ ప్రభుత్వం విలోమ విధానాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. గ్రామీణ ఉపాధి పథకం కోసం కేటాయించిన నిధులు చతికిలబడడం మొదలై ఏళ్లు గడుస్తోంది. సామాన్యుడి మీద మరింత భారం మోపడానికే బడ్జెట్ ప్రతిపాదించే తంతు కొనసాగిస్తున్నట్టుగా ఉంది. యువజన, మహిళ, పేదల, రైతుల సంక్షేమంకోసం పాటు పడ్తామని మోదీ ప్రభుత్వం చెప్పే మాటలన్నీ ఎప్పటిలాగే బూటకం అని ఈ బడ్జెట్ తేల్చేసింది. దశాబ్దం పైగా కొనసాగుతున్న మోదీ ఏలుబడిలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరగడమే తప్ప తగ్గుతున్న ఛాయలే లేవు. నిజానికి ఇది మోదీ ఎజెండాలోనే లేదు. ఈ బడ్జెట్ వల్ల కొన్ని వస్తువులు చౌక అవుతాయట. ఆ జాబితా చూస్తే నవ్వొస్తుంది. దిగుమతి చేసుకునే బంగారం, వెండి, మొబైల్ ఫోన్లు, వాటి విడిభాగాల ధరలు తగ్గుతాయట. మంచిదే కానీ దిగుమతి చేసుకునే మొబైల్ ఫోన్ల ధర తగ్గితే స్వదేశీ మొబైల్ పరిశ్రమలు నెత్తిన గుడ్డ వేసుకోవాల్సిందేగా! దీనివల్ల దొంగ రవాణా తగ్గుతుందట. నవ్వుకోవడం తప్ప ఏం చేయగలం? విశాఖపట్నం నుంచి చెన్నై దాకా పారిశ్రామికవాడల హారం నిర్మిస్తామంటున్నారు. ఇది అందమైన మరో నినాదం. ఇలాంటి నినాదాలు బడ్జెట్‌లో చాలానే కనిపిస్తాయి. చంద్రబాబు ఢిల్లీ దాకా వెళ్లి మోదీకి విజ్ఞప్తులు చేసినా ఒరిగింది ఏమీ లేదు. పోలవరం పథకం పూర్తి చేస్తామన్న హామీ మాత్రం పడేశారు. పోలవరం ప్రస్తావన దశాబ్దాల నుంచి వస్తూనే ఉంది. నికరమైన హామీ బడ్జెట్లో ఏమీ కనిపించదు. మోదీ ప్రభుత్వానికి తెలుగుదేశం పార్టీ ఎగబడి మద్దతు ఇస్తున్నా దక్కింది శూన్యమే. బడ్జెట్‌లోనే ఊరట లేనప్పుడు తరవాతెప్పుడో మేలు జరుగుతుందని చంద్రబాబు అనుకుంటే చేసేదేమీ ఉండదు.

అబద్ధానిదే పైచేయి

ఎల్లప్పుడూ సత్యాన్నే పలకాలన్న దాన్ని పక్కకు పెట్టి సమయానుకూలంగా మాట మార్చుకునే సంస్కృతి వేళ్లూనుకున్నాక సత్యాన్వేషణ వృథా ప్రయాసే అనిపిస్తుంది. దేవుని బొమ్మ మీదనో, రాజ్యాంగం ప్రతి మీదనో చెయ్యిపెట్టి పక్షపాతం చూపకుండా ప్రజాసేవ చేస్తాననే ప్రమాణంతో పదవి స్వీకరిస్తున్న నాయకులు దాన్ని కేవలం పది నిముషాల తంతుగానే చూస్తున్నారు తప్ప తీవ్రంగా తీసుకోవడం లేదు. 'ఆడి బొంకరాదు' అన్న మాటపోయి 'అబద్ధానికి జంకరాదు' అని నోటి శబ్దంగా పలికే మాటతో మిగతా శరీరానికిగాని, మనసుకు గాని సంబంధం లేనట్లు ఉంటున్నారు.



'ఎదుటి మనిషికి చెప్పేటందుకే నీతులు వున్నాయి' కాని మనం ఆచరించడానికి కాదనేది సత్యమని నమ్మబలుకుతున్నారు. సత్యవాక్కులతో సత్కీర్తి సంపాదించిన సహ సామ్రాజ్య చక్రవర్తి హరిశ్చంద్రుడిలా సత్యం కోసం తాము రాజ్యాలను పోగొట్టుకునేందుకు సిద్ధంగా లేమని ఖరాఖండిగా చెపుతున్నారు. ప్రతిపక్షంలో ఉంటే పేదలను లక్షాధికారులను చేస్తామంటారు. అధికారంలోకి వస్తే లక్షలు సంపాదిస్తున్నారు కాబట్టి పేదరికమే లేదంటారు. అధికారానికి రావడమే ఎజెండాగా అడిగిన వారికి, అడగని వారికి కూడా తామే అన్నీ సమకూర్చే ప్రకటిత దైవంగా భావించుకుని మేనిఫెస్టోల్లో వరాలజల్లులు కురిపించి అధికారం వచ్చాక వాటిపై అబద్ధాల రంగుపూసి అంతా గత ప్రభుత్వపు తప్పులంటూ బూచి దయ్యాలను చూపిస్తుంటారు. దేశంలోని కేంద్ర ప్రభుత్వమే కాకుండా అనేక రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి. పెద్దనోట్లు రద్దుచేసి దేశంలో ఉండే నల్లధనమంతా బయటకు తీసి అందరి ఖాతాల్లో జమచేస్తామన్న మాట కాలగర్భంలో కలిసిపోయింది. ప్రత్యేక హోదా కావాలని అరచి ప్రజలను రెచ్చగొట్టిన వాళ్లే దాన్ని అమలుచేసే అవసరమే లేదంటారు, లేక కుదరదంటారు.

మన రాష్ట్రంలో రాజధాని, పోలవరం లాంటివి కాకుండా మిగతా రాష్ట్రాలో అనేక ప్రాజెక్టుల్లాంటి పెద్ద విషయాలు కూడా మారిన ప్రభుత్వాల, కొత్త ప్రభుత్వాల మాటలకు పరిమితమై పాఠ్యపుస్తకాల్లోని అంశంలా ఎంత చదివినా ఇంకెంతో మిగిలి చివరిపేజీకి చేరడంలేదు. చేరేందుకు దశాబ్దాలు దాటవచ్చు. ఈ దేశ పౌరులుగా దేశానికేమైనా సేవచేయాలనే విషయం మర్చిపోయి తాము సమాజానికి ఆదర్శంగా ఉండడంకంటే దీర్ఘకాలం అధికారంలో ఉండడం ఈ దేశానికే అవసరమంటారు. అధికారమే ఎజెండాగా 'ఎప్పటి కెయ్యది ప్రస్తుతమో అప్పటికా పాట పాడు' అని తన మాటకు తానే కొత్త భాష్యం చెప్పేందుకు అలవాటు పడ్డారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోని వారిని ప్రజలు కూడా గ్రహించి సర్దుకొని తాత్కాలిక ప్రయోజనంకోసం మాత్రమే వెతుక్కుంటున్నారు. ప్రతినేత పలుకుల్లో ప్రజాస్వామ్యం ఫరిడవిల్లుతుంటుంది. కానీ రాత్రికి రాత్రే భుజాన జెండాల రంగులు, రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారిపోతుంటాయి. ధరలు నియంత్రిస్తామని, అంతా అభివృద్ధి కనబరుస్తామనే మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాక అది పక్కనబెట్టి గత ప్రభుత్వాల నిర్వాకంవల్ల ఈ దేశం లేదా రాష్ట్రం ముప్పయ్యేళ్లు వెనక్కి వెళ్లిందని తాము తిరిగి ముప్పై ఏళ్లు పాలించకపోతే ప్రజలకు భవిష్యత్తే ఉండదని, గత ప్రభుత్వానికి ఓటేసినందుకు ప్రజల గతి ఇంతేనంటారు. కోర్టుల్లో భిన్నమైన తీర్పులు గమనించినా, చట్టాల్లో మార్పులు గమనించినా, ఎఫ్.ఐ.ఆర్‌లలో కూర్పులు, చేర్పులు గమనించినా నిరంతరం మాటలుమార్చి మాట్లాడుతున్న నేతలకు అనుకూలంగానో, ప్రతికూలంగానో గోచరిస్తుంటాయి. వ్యక్తిగత ఎజెండాల జెండాల నీడలు వ్యవస్థల నిష్పాక్షికత మీద దెబ్బతీస్తుంటాయి..

చెప్పింది చెప్పినట్లుగా ప్రజారంజకమైన పనులు అమలుచేసే నాయకత్వం క్రమేణా కనుమరుగవుతోంది. నిజాయతీగాఉంటే చాపకిందికి నీరు వస్తుందని దాన్ని అబద్ధాలతో అడ్డుకోవాలని చూస్తుంటారు. భిన్నమైన రాజకీయ పార్టీలలో విభిన్న వాదనలు కలిగి ఉండడం సహజం. మనుషులంతా ఒక్కటేననే భావన మనసులో లేనప్పుడు అస్మదీయులు, తస్మదీయులుగా విడగొట్టి విపరీతార్థాలు చెబుతారు. కానీ, అధికారంలో ఉన్న వాళ్లు పార్టీలకతీతంగా ప్రజలందరినీ ఏక దృష్టితో మాత్రమే చూడాలి. కుల, మత, ప్రాంతీయ తత్వాలకు తావులేకుండా, ప్రధాని అయితే దేశం మొత్తానికి, ముఖ్యమంత్రులైతే రాష్ట్రం మొత్తానికి అనే భావన వారి మాటల్లో ప్రతిధ్వనించాలి. ప్రభుత్వమైనా, ప్రతిపక్షమైనా అబద్ధాలతో దర్జాగా కాలక్షేపంచేస్తూ గడపాలనుకుంటే మాత్రం ఏదో ఒక సందర్భంలో నిజం నిప్పులా అనుభవిస్తున్న అవకాశాలను దహించివేస్తుంది.

– జోస్యుల వేణుగోపాల్

సెల్: 9440436806

కొరవడిన అభివృద్ధి స్ఫూర్తి

కె. రవీంద్రన్

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా రాజకీయ ప్రయోజనాలు ఆశించి పెట్టినట్టుగా ఉంది. సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వాములైన రాజకీయ పార్టీలను సంతృప్తిపరచేలా ఈ బడ్జెట్ ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ బడ్జెట్ ప్రతిపాదనలలో రాజకీయ అవసరాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఒకవిధంగా ఇది రాజకీయ బడ్జెట్ అనడంలో ఎటువంటి అనుమానంలేదు. ఆర్థిక వనరులకంటే రాజకీయ అవసరాలు ముఖ్యమైనవిగా ఈ బడ్జెట్ ఉంది. ఈ బడ్జెట్ ఇబ్బందికరంగా ఉంటుందని కూడా ఆర్థికమంత్రి భావించకపోవడం దారుణం. బీహార్, ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీల సహకారంతో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ ప్రతిపాదనలలో ఈ అంశం స్పష్టంగా కనిపిస్తోంది. రాజీపడిపోవడం, సర్దుబాటు చేసుకోవడం లాంటి అంశాలు ఈ బడ్జెట్ ప్రతిపాదనలలో ప్రధానంగా ఉన్నాయి. సూత్రీకరణలకంటే ఆదేశించిన విధానానికి సంబంధించిన అంశాలు అనేకం ఉన్నాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపుచేసే చర్యలు ఈ బడ్జెట్‌లో అసలు కనిపించడంలేదు. మిత్రపక్షాలను ఇబ్బందిపెట్టకుండా సమతూకంగా ఆర్థిక సుస్థిరతకంటే ప్రభుత్వంలో భాగస్వాములను సంతృప్తి పరచేందుకే అన్నట్టుగా బడ్జెట్‌పత్రం రూపొందింది.

సమకాలీన భారతదేశంలో సంకీర్ణప్రభుత్వ పాలనలో అనేక తికమకలకు ఈ బడ్జెట్ నిదర్శనంగా ఉంది. ఉద్యోగాల కల్పనపై నిర్మలా సీతారామన్ అరచేతిలో వైకుంఠం చూపించారు. తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి అనేక పరాభవాలు ఎదురుకావడంతో వివిధ అంశాలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ రూపొందించారు. ఉద్యోగాల కల్పనకు కచ్చితంగా తీసుకునే చర్యలకు సంబంధించిన ప్రణాళిక ఈ బడ్జెట్‌లో ఎక్కడా కనిపించడంలేదు. ఉద్యోగాల లేమి, అతి తక్కువ ఉద్యోగాలు ఉండటంతో పదుల లక్షల సంఖ్యలో యువత నిరుద్యోగులుగా ఉన్నారు. ఈ అంశాన్ని కూడా బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడా ప్రస్తావించలేదు.

పూర్తిగా ఆర్థిక రంగానికి ప్రాముఖ్యతను ఇవ్వడానికి బదులుగా రాజకీయ అంశాలకు ఈ బడ్జెట్ ప్రాధాన్యతనిచ్చింది. ప్రాంతీయ పార్టీలను బుజ్జగించవలసిన అవసరాన్ని అనుసరించి ద్రవ్య ప్రాధాన్యతలను నిర్ధారించారు. మిత్రపక్షాలపై ఆధారపడాల్సి రావడంతో అధికారంపైన బీజేపీ గట్టిపట్టు సాధించేందుకు ఈ బడ్జెట్ ప్రతిపాదనలలో ప్రాధాన్యత ఇచ్చారు. బడ్జెట్ తయారీకి నిశితంగా చర్చలు జరిపారు. అన్ని వర్గాల నుంచి వస్తున్న ఆర్థిక డిమాండ్లను పరిష్కరించడానికి కొన్ని వ్యూహాత్మకమైన తప్పనిసరి చర్యలను తీసుకోవలసి ఉంటుంది. తప్పనిసరైన రాజకీయ అవసరాలు నిర్మలమ్మ బడ్జెట్‌లో అధికంగా కనిపించాయి. అంతర్గతంగా వైరుధ్యాలు కనిపిస్తాయి. ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలు బడ్జెట్‌లో మనకు అసలు కనిపించవు. సామాన్యులు నిత్యం వాడుకుంటున్న వస్తువులు, ఆహారధాన్యాలు, పప్పు ధాన్యాలు తదితర అనేకం ధరలు రోజురోజుకూ పెరిగి కష్టాలపాలవుతున్నారు. ఈ పరిస్థితి దశాబ్దికాలంగా కొనసాగుతున్నది. ఈ అంశాన్ని బడ్జెట్‌లో ఎక్కడా పేర్కొనలేదు.

రాజకీయ, ఆర్థిక విషయాలకు సంబంధించిన అంశాలు బడ్జెట్‌లో లేవు. పరిమిత కాల రాజకీయ తప్పనిసరి అవసరాలు, సుస్థిర ఆర్థిక డిమాండ్ల మధ్య ఉద్రిక్తతలు ఉంటాయి. ద్రవ్య వివేకమైన అంశాలపైనే ప్రభుత్వ విశ్వసనీయత ఉంటుంది. అయితే ఇందులో ఈ విశ్వసనీయత దెబ్బతింటుందని భావించవలసిన అవసరం ఉంది. నిర్మలమ్మ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై అత్యంత తీవ్రమైన విమర్శలు, అసంతృప్తులు ఉంటాయి. ప్రత్యేకించి బీజేపీ మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఈ బడ్జెట్‌లో అధిక కేటాయింపులు జరిగాయనీ, ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను నిర్లక్ష్యం చేశారన్న విమర్శలు వెలువెత్తాయి. సమాఖ్యవ్యవస్థ విలువలను సంకీర్ణ ప్రభుత్వం దాదాపుగా పట్టించుకోవడంలేదు. వనరులను అన్ని రాష్ట్రాలకు సమంగా పంపిణీచేసే ద్రవ్యపరమైన అంశాలు కనిపించవు. ఉదాహరణకు కేరళ, తమిళనాడు, కర్నాటకకు సంబంధించిన ప్రముఖమైన అంశాలను లేదా గణనీయమైన కేటాయింపులు బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు. ప్రతిపక్షాలు పాలించే రాష్ట్రాలకు అర్థవంతమైన కేటాయింపులు కనిపించవు. దేశ రాజ్యాంగంలో పేర్కొన్న సమాఖ్య సూత్రాలకు ప్రభుత్వం దూరమైపోయిందని ప్రతిపక్షపార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలు విమర్శిస్తున్నప్పటికీ మోదీ ప్రభుత్వం ఆలకించడంలేదు. చారిత్రకంగా రాజకీయ పార్టీల అనుబంధాలతో నిమిత్తంలేకుండా విభిన్నరాష్ట్రాల ప్రాధాన్యతలను, ద్రవ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమతుల్యంగా దేశ బడ్జెట్‌కు సంబంధించిన ప్రణాళికను రూపొందిస్తూ వస్తున్నారు. సహకార ఫెడరల్ సూత్రీకరణకు కట్టుబడి పరిపాలన సాగాలి. అయితే నిర్మలా సీతారామన్ బడ్జెట్ ఆ విధంగాలేదు. సంకీర్ణ ప్రభుత్వంలోని భాగస్వామ్య పార్టీలను శాంతింపచేసేందుకే ఆర్థికమంత్రి ప్రాధాన్యతనిచ్చారు.

ప్రతిపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాలకు బడ్జెట్‌లో అతితక్కువ ప్రాధాన్యత నిచ్చారు. ద్రవ్య నిర్లక్ష్యంకంటే ఇది ఎక్కువ అని చెప్పాలి. సమాఖ్య వ్యవస్థలో విభిన్న ఆర్థిక తప్పనిసరి అవసరాలు ఉంటాయి. వీటిపట్ల బడ్జెట్‌లో ఏమాత్రం అనుకూలత చూపలేదు. కేరళ, తమిళనాడు అత్యధిక ఆర్థిక సహకారం, విశిష్ట అభివృద్ధి, సవాళ్లు తదితర అంశాలను ద్రవ్యపరమైన చర్చల నుంచి మినహాయించారు. తమిళనాడు దీర్ఘకాలంగా పారిశ్రామికంగా విస్తరించిన రాష్ట్రం. భారత్ జీడీపీకి ఈ రాష్ట్రం గణనీయంగా నిధులను సమకూరుస్తున్నది. అయినప్పటికీ ఈ రాష్ట్రానికి కేటాయింపులలో నిర్లక్ష్యం వహించింది. ఈ రాష్ట్రం ఆసక్తి చూపిస్తున్న అభివృద్ధి, ఆకాంక్షలు, ప్రత్యేకించి ఉత్పత్తి, వ్యవసాయం, పట్టణ మౌలిక సదుపాయాలు లాంటి అంశాలను అసలు పట్టించుకోలేదు. ఇతర రాష్ట్రాలకు రాజకీయ సర్దుబాటుకు నిర్ణయం తీసుకున్నారు. ఇతర రాష్ట్రాలలో ఉద్యోగాలను సృష్టించడానికి పెట్టుబడులు ఉండటంలేదు. దీర్ఘకాలిక ఆర్థిక సుస్థిరతకంటే తాత్కాలిక, రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యతినిస్తూ నిర్లక్షపూరిత ద్రవ్య విధానాన్ని అనుసరిస్తున్నారు. నిర్మలా సీతారామన్ బడ్జెట్ వ్యూహంలో కేవలం ద్రవ్య కేటాయింపుల కంటే ఇతర అనేక పరిణామాలు ఉంటాయి. ప్రతిపక్ష రాష్ట్రాలపై నిర్లక్ష్యం, మరింతగా బెదిరింపులు కొనసాగుతాయి. ప్రాంతీయ ఇబ్బందులు అత్యధికంగా ఉంటాయి. భారత్ అభివృద్ధికి అవసరమైన స్ఫూర్తి గణనీయంగా తరిగిపోతుంది.

నష్టాల ఊబిలో బొప్పాయి రైతులు

పి.జమలయ్య

నర్సరీ యాజమాన్యాలు, విత్తన కంపెనీలు నాణ్యతలేని విత్తనాలు, నాసిరకం బొప్పాయి నారును విచ్చలవిడిగా విక్రయిస్తూ రైతాంగాన్ని మోసగిస్తూ రైతులను దోచుకుంటున్నారు. ముఖ్యంగా రైల్వే కోడూరు, రాజంపేట, పీలేరు తదితర ప్రాంతంలో ఎప్పటి నుండో తైవాన్ రెడ్ లేడి 786 వెరైటీ రకం వంగడం నుంచి పెంచిన నారు వాడుతుంటారు. తైవాన్ రెడ్ లేడి 786 చీడపీడలు ఎక్కువ కావడంతో ప్రత్యామ్నాయంకోసం ఎదురుచూస్తున్న తరుణంలో జి.15, ఎక్స్‌ఎఫ్ 15 వెరైటీ రకం మార్కెట్‌లోకి వచ్చింది. ఈ రకం నారు అన్నిరకాల తెగుళ్లను, చీడపీడలను తట్టుకోగలదని నర్సరీ యాజ మాన్యాలు బొప్పాయి రైతులను నమ్మించి నిట్టనిలువునా మోసగిస్తున్నారు. పెట్టుబడులు పెట్టలేని చిన్న, సన్నకారు కౌలురైతులు దిగుబడి బాగా వస్తుందనే ఆశతో నర్సరీ యాజమాన్యాలు విషవలయంలో చిక్కుకుంటున్నారు. చదువులేని కౌలురైతుల అమాయకత్వాన్ని అసరా చేసుకుని ఒక్కో మొక్క నారును 11 నుంచి 15రూపాయలకు విక్రయించి అందిన మేరకు దోచుకుంటున్నారు. నారు తీసుకు వెళ్ళిన రైతులు దిగుబడి రాక నిట్టనిలువునా మోసపోతున్నారు. కనీసం ఖర్చులురాని పరిస్థితి ఏర్పడుతుంది. రాయలసీమలోని అన్నమయ్య జిల్లా కలికిరి, వాయల్పాడు, గుర్రంకొండ, కలకడ తదితర మండలాల్లో పలు గ్రామాల్లో బొప్పాయి సాగుకు వేలకువేలు కౌలు(లీజు) చెల్లించి, లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టినా పంట రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో బొప్పాయి రైతులు విలవిలాడుతున్నారు. నాణ్యత కల్గిన ప్రతి బొప్పాయి చెట్టుకు ఎంతలేదన్నా 100 కాయలు రావాలి. ప్రతికాయ రెండున్నర కేజీల బరువు ఉండాలి. మంచి రంగు, నాణ్యతతో దిగుబడి రావాలి. నాసిరకం నారు కావడంతో కాయ సైజు పెరగడంలేదు. దిగుబడి లేదు. కాచిన కాయలు పరిపక్వానికి రాక ముందే రాలిపోతున్నాయి. రంగులేదు రుచి లేదు. మార్కెట్‌కు తీసుకు వెళ్ళితే కాయల ముఖం చూసే పరిస్థితిలేదు. దీనికి కారణం నాసిరకం నారేనని రైతులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఉలుకూపలుకు లేకుండా ఉంది. పుట్టగొడుగుల్లాగా పుట్టుకొస్తున్న నర్సరీలను రాష్ట్ర ప్రభుత్వం నియంత్రించేందుకు ఎటువంటి చర్యలు లేవు. నాణ్యతలేని విత్తనాలు తీసుకొచ్చి నారుపెంచి అమ్ముతుంటే తనిఖీచేసే దిక్కులేదు. లైసెన్స్ లేని నర్సరీలే మార్కెట్‌లో కల్తీ నారు విక్రయాలల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. స్టాక్ రిజిస్టర్ ఉండటం లేదు. నారు కోనుగోలు చేస్తే బిల్లులు ఇవ్వటం లేదు. అంతా ఆన్‌లైన్ పేమెంటులు. నర్సరీ యాజమాన్యాలు జీరో వ్యాపారంచేస్తూ ఒకవైపు ప్రభుత్వాన్ని, మరొకవైపు రైతాంగాన్ని మోసగిస్తున్నా నర్సరీ యజమానులపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఉద్యానవన శాఖ మొద్దు నిదుర పోతున్నది.

అన్నమయ్య జిల్లాలో మదనపల్లిలోగల శేఖర్ రెడ్డి నర్సరీ, కలికిరి యల్లారెడ్డి, రాజన్న నర్సరీల నుంచి కలికిరి, గుర్రంకొండ, వాయల్పాడు కలకడ తదితర మండలాల్లో అనేక గ్రామాల రైతులు బొప్పాయి నారు కోనుగోలు చేస్తే బిల్లులు ఇవ్వని పరిస్థితి. అంతా ఫోన్ పే చెయించుకున్నారు. పంట రాలేదు అని అడిగితే మాకు సంబంధం లేదని తెగేసి చెబుతున్నారు. ఉద్యాన శాఖ దృష్టికి తీసుకు వెళ్ళితే నాసిరకం నారు ఎందుకు వేశారని రైతులను బుకాయిస్తున్నారు తప్ప నర్సరీయాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని చెప్పడం లేదు. దీంతో ఏమీ చేయలేని పరిస్థితి రైతాంగంలో ఉంది.

రాష్ట్రంలో బొప్పాయి 15 నుంచి 20 వేల ఎకరాలకుపైగా సాగువుతున్నది. అన్నమయ్య జిల్లాలో 5000, అనంతపురంలో 2200, ప్రకాశంలో 2000, సత్యసాయిలో 900, వైఎస్ఆర్ కడప 900 నంద్యాలలో 700, కర్నూలులో 600 ఎకరాల చొప్పున బొప్పాయి పండిస్తున్నారు. బొప్పాయిసాగు రాష్ట్రం మొత్తంగా పరిశీలిస్తే 75శాతం పంట రాయలసీమ జిల్లాలోనే ఉంది. ముఖ్యంగా అన్నమయ్య జిల్లాలో అత్యధికంగా ఉంది. జిల్లాలో రైల్వేకోడూరు, రాజంపేట, పీలేరు తదితర ప్రాంతంలో బొప్పాయి పంట చిన్న, సన్నకారు, కౌలు రైతులకు జీవనాధారంగా ఉంది.

బొప్పాయిసాగులో 90శాతం కౌలురైతులే. రెండు ఎకరాల నుంచి 5 ఎకరాల వరకూ లీజుకు తీసుకుంటున్నారు. బొప్పాయి పంట సంవత్సరన్నర కావడంతో ఎకరానికి రూ. 35వేలు నుంచి 40వేల వరకు కౌలు రేట్లు ఉన్నాయి. నారు నాటేముందు కౌలు మొత్తంలో సగం ముందే చెల్లించాలి. ఆ తరువాత పంట మధ్యలో మిగిలిన మొత్తాన్ని చెల్లించాలి. పంట పండినా పండక పోయినా కౌలుమాత్రం గ్యారెంటీగా చెల్లించాల్సి ఉంది. కౌలు చెల్లించడానికి డబ్బులు వడ్డీకి తీసుకు రావాల్సిందే. ఇంతకు ముందు పేర్కొనట్లు వీరంతా చిన్న, సన్న కారు కౌలురైతులు. ముఖ్యంగా సెంటు భూమిలేని వారే. పెట్టుబడిని పరిశీలిస్తే ఏ పంటకు లేనంతగా బొప్పాయి సాగుకు ఖర్చు అవుతుంది.

కౌలుకు, సేద్యానికి పెట్టుబడి నూటికి రెండు రూపాయల వడ్డీకి తెచ్చి బొప్పాయి పంటలు పండిస్తున్నారు. ఒక ఎకరంలో బొప్పాయి సాగుకు సుమారు రెండు లక్షల పైనే అవుతుంది. స్థూలంగా అధ్యయనంచేస్తే నారు కొనుగోలు రూ.12వేలు, పశువుల ఎరువులు రూ. 35వేలు, రసాయన ఎరువులు రూ.30వేలు, డ్రిప్ పరికరాలకు రూ.6వేలు, డ్రిప్ ఎరువులకు రూ.15వేలు దుక్కి రూ.15వేలు, పురుగు మందులు రూ.15వేలు, వివిధ కూలీల ఖర్చులు రూ.20వేలు, కౌలు రూ.40వేలు, మొత్తం పెట్టుబడికి వడ్డీ కలుపు కుంటే నూటికి రూ.2చొప్పున 2 లక్షలు అప్పు చేయాలి.

బొప్పాయి పంటకు మార్కెట్‌లో ఎప్పుడూ ఒడిదుడుకులే ఉంటాయి. కష్టపడి పంట పండిస్తే తీరా మార్కెట్ మాయాజాలంలో రైతులు బలి కావాల్సిందే. కనీసం పెట్టుబడైనా వస్తుందా అంటే అది కూడా కనాకష్టమే అవుతుంది. వాతావరణం బాగుండి, ఎటువంటి చీడపీడలు రాకుండా, ప్రకృతి విపత్తులు లేకుండా పరిస్థితులు సానుకూలంగా ఉంటే సరాసరి దిగుబడి 25టన్నులు వస్తుందని అంచనా. కనీసం టన్ను రూ.20వేలకు అమ్మితే పెట్టుబడి వస్తుందని గుర్రంకొండ కొండ, కలికిరి, వాయల్పాడు మండలాలకు చెందిన కౌలురైతులు చెబుతున్నారు. లేకపోతే అప్పులు పాలే అంటున్నారు. నాసిరకం నారువలన జరిగిన నష్టానికి ఎకరానికి రెండు లక్షల రూపాయలు నర్సరీ యాజమాన్యాలనుంచి ఇప్పించాలని, రైతులను నమ్మించి మోసగించిన నర్సరీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నాసిరకం విత్తనాలు అమ్ముతున్న కంపెనీలపై కఠినమైన చర్యలు చేపట్టాలని రాయచోటి కలెక్టర్ ఆఫీసువద్ద ఇటీవల కాలంలో ఈ మూడు మండలాల రైతాంగం రైతు, కౌలురైతుల సంఘాల ఆధ్వర్యంలో ధర్నా కూడా నిర్వహించింది. పుట్టుకొస్తున్న నర్సరీలను నియంత్రించడానికి చట్టం ఉన్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ు చీడపీడలు సమస్యలు కూడా ఎక్కువే.వీటి వల్ల జరిగిన పంట నష్టానికి ఎటువంటి పరిహారం అందటలేదు. ఉచిత పంటల భీమా పథకాన్ని అమలు చేయవలసిన ప్రాధాన్యత ఉంది. మార్కెటింగ్‌శాఖ బొప్పాయిపంటకు మంచిధర వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. బొప్పాయి సాగులోఉన్న కౌలురైతులకు కౌలుగుర్తింపు కార్డులు జారీ చేయాలి. పంటరుణాలు, పెట్టుబడి సాయం, ఇన్‌పుట్ సబ్సిడీలు, బీమా పరిహారం తదితర సౌకర్యాలు అందించాలి. ఉద్యాన, వ్యవసాయ శాఖ, మార్కెట్, బ్యాంకు, రెవెన్యూ తదితర శాఖలతో కమిటీవేసి ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తూ పరివేక్షణ చర్యలు తీసుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి

వ్యవసాయానికి రూ.1.52 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తోంది. మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించిన పథకాలను కొనసాగిస్తూనే కొత్త విధానాలకు శ్రీకారం చుట్టింది. సాగు ఉత్పాదకత పెంచడమే లక్ష్యంగా పద్దులో కేటాయింపులు చేసింది. మొత్తంగా వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు కేటాయించింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో రైతుల సమస్యలు, సాగు విధానాలపై పెద్దఎత్తున చర్చ జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈసారి సాగు రంగానికి ప్రాధాన్యమిచ్చినట్లు తెలుస్తోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులను సైతం తట్టుకోగలిగి, అధిక దిగుబడినిచ్చే కొత్త వంగడాల దిశగా వ్యవసాయ పరిశోధనలు ప్రోత్సహిస్తామని మంత్రి ప్రకటించారు. ఆ దిశగా తగిన నిధులు అందజేస్తామని తెలిపారు. ప్రైవేటు రంగాన్ని ఇందులో భాగస్వామ్యం చేస్తామని, దీన్ని నిరంతరం ఆయా రంగాల్లోని నిపుణులు సహా ప్రభుత్వ అధికారులు పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటామని నిర్మలా సీతారామన్ తెలిపారు. వాతావరణ మార్పులను తట్టుకోగలిగే 109 రకాల అధిక దిగుబడి వంగడాలను విడుదల చేస్తామని ప్రకటించారు. వచ్చే రెండేళ్లలో కోటి మంది రైతులు ప్రకృతి వ్యవసాయంలోకి వచ్చేలా ప్రోత్సహిస్తామని, వారి ఉత్పత్తులకు బ్రాండింగ్, సర్టిఫికేషన్ ఇస్తామని తెలిపారు. శాస్త్ర, సాంకేతిక సంస్థలు, గ్రామ పంచాయతీల ద్వారా దీన్ని అమలుచేస్తామని, 10వేల బయో-ఇన్‌పుట్ రీసోర్స్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పప్పు ధాన్యాలు, నూనెగింజల సాగులో స్వయంసమృద్ధి సాధించడమే లక్ష్యంగా కేంద్రం అనేక చర్యలు ప్రకటించారు. వీటి ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్‌ను మరింత బలోపేతం చేస్తామని, మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా ఆముదం, వేరుశనగ, నువ్వులు, సోయాబీన్, పొద్దుతిరుగుడు వంటి నూనెగింజల్లో స్వయం సమృద్ధి దిశగా ప్రత్యేక వ్యూహాన్ని అనుసరిస్తామని ప్రకటించారు. కూరగాయల ఉత్పత్తి కోసం భారీ క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని కేంద్రం తెలిపారు. అధిక వినియోగం ఉండే ప్రాంతాల సమీపంలో వీటిని నెలకొల్పుతామని పేర్కొన్నారు. కూరగాయల సేకరణ, నిల్వ, మార్కెటింగ్ కోసం ప్రత్యేక సరఫరా వ్యవస్థలను ఏర్పాటుచేసేలా అంకుర సంస్థలు, సహకార సంఘాలు, రైతు సంఘాలను ప్రోత్సహిస్తామని చెప్పారు. రొయ్యల సాగు కేంద్రాల నెట్‌వర్క్‌లు ఏర్పాటుచేయడం కోసం ప్రత్యేక ఆర్థికసాయం అందజేస్తామని, నాబార్డ్ ద్వారా దీన్ని సమకూరుస్తామని స్పష్టం చేశారు. సహకార రంగం సర్వతోముఖాభివృద్ధి కోసం జాతీయ సహకార విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. గ్రామీణ ఆర్థికం, ఉపాధి కల్పన అవకాశాలను వేగవంతం చేయడమే దీని లక్ష్యమని వెల్లడించారు.

బంగారం ధర తగ్గింది

న్యూఢిల్లీ: పారిశ్రామిక రంగానికి ఊతమిస్తూ దేశీయ తయారీరంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో కస్టమ్స్ డ్యూటీపై భారీగా కోతలు విధించింది. ఫలితంగా ఎలక్ట్రానిక్ వస్తువులు, విలువైన లోహాలు, కీలక ఔషధాల ధరలు కొంతమేరకు తగ్గనున్నాయి. మరికొన్ని వస్తువులపై మాత్రం ఈ డ్యూటీని పెంచారు. గత కొన్నేళ్లుగా నగలు, వజ్రాల ఎగుమతి వ్యాపారులు ప్రభుత్వానికి చేస్తున్న డిమాండ్ ఇప్పుడు నెరవేరింది. బంగారంపై ఉన్న బేసిక్ కస్టమ్స్ డ్యూటీని ఈసారి బడ్జెట్‌లో తగ్గించారు. పుత్తడి, వెండి వస్తువులు, కడ్డీలపై కస్టమ్స్ డ్యూటీని 15 శాతం నుంచి 6 శాతానికి కుదించారు. ఇక ప్లాటినం, పల్లాడియం, ఓస్మియం, రుథేనియం, ఇరీడియంపై 15.4 శాతం నంచి 6.4 శాతానికి తగ్గించారు. ఈ నిర్ణయంతో భారత్ నుంచి పుత్తడి ఆభరణాల ఎగుమతులు పెరుగుతాయని ఆశిస్తున్నారు. తక్కువకు ముడిబంగారం కొనుగోలు చేసి... దేశీయంగా దానికి అదనపు విలువను జోడించి విక్రయించే అవకాశాలు మెరుగయ్యాయి. కాగా, బడ్జెట్ ప్రభావం అప్పుడే పుత్తడిపై పడింది. ఆర్థికమంత్రి ప్రకటనతో బంగారం మార్కెట్లో ధరలు భారీగా పతనమయ్యాయి. మధ్యాహ్నానికి ఎంసీఎక్స్‌లో 10 గ్రాముల బంగారం ధర ఒక దశలో రూ.4,000 తగ్గి రూ.68,500కు చేరుకుంది. వెండి కూడా కిలో రూ.2,500 తగ్గి రూ.84,275 వద్ద ట్రేడవుతోంది.

ఆరోగ్యానికి రూ.90,958.63 కోట్లు

గతసారి కంటే 12.96శాతం పెంపుదల

న్యూఢిల్లీ: ఆరోగ్య రంగానికి బడ్జెట్ కేటాయింపు పెరిగింది. 2023-24 సవరిత బడ్జెట్ అంచనా రూ.80,517.62 కోట్లు కాగా ఇప్పుడు దానిని 12.96 శాతం పెంచారు. 2024-25 బడ్జెట్‌లో రూ.90,958.63 కోట్లు కేటాయించారు. ఆయుష్ మంత్రిత్వశాఖ కేటాయింపును రూ.3వేల కోట్ల నుంచి రూ.3,712.49 కోట్లకు స్వల్పంగా పెంచారు. ఆరోగ్య రంగానికి కేటాయించిన మొత్తం రూ.90,958.63 కోట్ల నుంచి రూ.87,656,90 కోట్లను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు, రూ.3,301.73 కోట్లను ఆరోగ్య పరిశోధన శాఖకు కేటాయించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పథకాలకు బడ్జెట్ కేటాయింపు రూ.77,624.79 కోట్ల నుంచి రూ.87,656.90 కోట్లకు పెరిగింది. జాతీయ ఆరోగ్య మిషన్ కోసం 2023-24లో రూ.31,550.87 కోట్లు కేటాయిస్తే... ఈసారి రూ.36వేల కోట్లు కేటాయించారు. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎం-జే) కేటాయింపును రూ.6,800 కోట్ల నుంచి రూ.7,300 కోట్లకు పెంచారు. జాతీయ టెలీ మానసిక ఆరోగ్య కార్యక్రమం కోసం రూ.90కోట్లు కేటాయించారు. గతసారి కేటాయింపు రూ.65 కోట్లగా ఉంది. జాతీయ డిజిటల్ ఆరోగ్య మిషన్ కేటాయింపు యథావిధిగా రూ.200 కోట్లుగా ఉంది. న్యూఢిల్లీ ఎయిమ్స్ కేటాయింపు రూ.4,278 కోట్ల నుంచి రూ.4,523 కోట్లకు పెరిగింది. భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) కేటాయింపు రూ.2295.12 కోట్ల నుంచి రూ.2,732.13 కోట్లు అయింది. స్వయంప్రతిపత్తిగల సంస్థల కోసం 2023-24లో రూ.17,250.90 కోట్లు కేటాయించగా, ఈసారి దానిని స్వల్పంగా పెంచి రూ.18,013.62 కోట్లు చేస్తూ కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు.

మూడు కేన్సర్ మందులపై సుంకం ఎత్తివేత

న్యూఢిల్లీ: కేన్సర్ మందులపై సుంకం ఎత్తివేసినట్లు కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. మూడు మందులపై కస్టమ్స్ సుంకాలు మినహాయిస్తున్నట్లు తెలిపారు. ట్రాస్తుజుమబ్ డెరుక్స్‌టెకన్, ఓసిమెర్టినిబ్, దుర్వాలుంబ్‌పై ప్రస్తుతమున్న 10శాతం సుంకాన్ని పూర్తిగా రద్దు చేసినట్లు బడ్జెట్ సందర్భంగా ప్రతిపాదించారు. అలాగే మెడికల్ ఎక్స్‌రే యంత్రాల్లో వినియోగించే ఎక్స్‌రే ట్యూబ్‌లు, ఫ్లాట్ ప్యానల్ డిటెక్టర్లపైనా ప్రాథమిక కస్టమ్స్ సుంకం (బీసీడీ)లో మార్పులను ప్రతిపాదించారు. కేన్సర్‌కు వాడే మూడు మందులపై సుంకాన్ని ఎత్తివేయడం స్వాగతించదగినదిగా ఎఫ్ఐసీసీఐ ఆరోగ్య సేవల కమిటీ చైర్మన్, వ్యవస్థాపకుడు, మహారాజ్ ఇమేజింగ్ & ల్యాబ్స్ చైర్మన్ హర్ష్ మహారాజ్ అన్నారు. ఫోర్టిస్ ఆసుపత్రి ప్రిన్సిపల్ డైరెక్టర్, చీఫ్ ఆఫ్ న్యూరాలజీ ప్రవీణ్ గుప్తా కూడా దీనిని స్వాగతించారు. ఈ చర్యలు అంచనా కంటే తక్కువగా ఉన్నప్పటికీ కేన్సర్ ఆధునిక చికిత్సను అందుబాటులోకి తేవడానికి దోహదమవుతాయని ఆయనన్నారు.

రక్షణ రంగానికి రూ.6.21లక్షల కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో రక్షణ రంగానికి రూ.6.21లక్షల కోట్లు కేటాయిస్తూ ఆర్థిక మంత్రి సీతారామన్ మంగళవారం ప్రకటన చేశారు. గతసారి కంటే 4.72శాతం అదనంగా కేటాయించినట్లు తెలిపారు. రక్షణ రంగానికి రూ.6,21,541 కోట్లు కేటాయించగా ఇది బడ్జెట్ మొత్తంలో 12.9శాతంగా ఉంది. 2023-24లో రూ.5,93,537.64 కోట్లు, 2022-23లో రూ.5,25,166 కోట్లు రక్షణ రంగానికి కేటాయించారు. తాజా కేటాయింపులో 27.67శాతాన్ని కేపిటల్‌గా వినియోగిస్తారు. రెవెన్యూ ఖర్చు కోసం 14.82శాతాన్ని వాడతారు. 30.68శాతాన్ని చెల్లింపులు, అలవెన్సులకు, 22,72శాతాన్ని పింఛన్లకు, 4.11శాతాన్ని రక్షణ శాఖ పరిధి పౌర సంఘాల కోసం వినియోగమవుతుంది. కాగా కొత్త ఆయుధ వ్యవస్థలు, పరికరాల కోసం కేపిటల్ బడ్జెట్ వినియోగమవుతుందని ప్రకటన తెలిపింది.

విద్య, ఉపాధి, నైపుణ్యానికి పెద్దపీట!

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్ 2024-2025 యువత, ఉపాధిపై దృష్టి పెట్టింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విద్య, ఉపాధి, నైపుణ్యానికి రూ.1.48 లక్షల కోట్లు కేటాయించింది. గత పదేళ్ల పాలనలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉపాధి కల్పనపై దృష్టి సారించలేదు. యువతకు తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడం సవాలుగా మిగిలిపోయింది. నిరుద్యోగ గణాంకాలు పైకి ఎగబాకాయి. ప్రభుత్వ చర్యలపై అసంతృప్తి యువ జనాభాలో పెరిగింది. నిరుద్యోగ పెరుగుదల గురించి చర్చ, ఉపాధి సంఖ్యలపై తీవ్ర స్థాయిలో చర్చలు జరిగాయి. దేశంలో నిరుద్యోగం పెరుగుతుండటంపై వామపక్ష పార్టీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. యువతకు ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. 2024-25 బడ్జెట్ కోసం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అనేక రంగాల నుంచి పోటీ డిమాండ్లను ఎదుర్కొన్నారు. ఎన్‌డీఏ మిత్రపక్షాల నుంచి ఒత్తిళ్లతో పాటు ఈ సంవత్సరం మూడు రాష్ట్రాలలో కీలకమైన అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజకీయ ప్రయోజనం అవసరం. ఈ పరిస్థితుల్లో అత్యంత ముఖ్యమైన ఉపాధి, ఉద్యోగ కల్పనపై దృష్టి పెట్టారు. భారతదేశం భవిష్యత్తు వృద్ధి ఎక్కువగా నైపుణ్యం, అధిక సంఖ్యలో యువతకు ఉపాధి కల్పించడంపై ఆధారపడి ఉంటుంది. భారతదేశం అభివృద్ధి చెందుతున్న జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు ఉన్నారు. ఆర్థిక సర్వే ప్రకారం చాలామందికి ఆధునిక ఆర్థిక వ్యవస్థకు అవసరమైన నైపుణ్యాలు లేవు. 'యువతలో దాదాపు 51.25 శాతం మంది ఉపాధి పొందగలరని అంచనాలు చూపిస్తున్నాయి. మరో మాటలో చెప్పాలంటే, కళాశాల నుంచి బయటకు వచ్చిన ఇద్దరిలో ఒకరు ఇంకా తక్షణమే ఉద్యోగంలో చేరలేరు. ఏది ఏమైనప్పటికీ, మరిన్ని ఉద్యోగాల అవసరం భారతదేశ ఆర్థిక వృద్ధికి కేంద్రం. సీతారామన్ తన ఏడవ బడ్జెట్‌లో నేరుగా ఉపాధిని పెంపొందించే పథకాలను ఆవిష్కరించారు. అలాగే యజమానులు, విద్యాసంస్థలను భాగస్వామ్యం చేయడం ద్వారా నైపుణ్యం పెంచడంపై దృష్టి సారించారు.

ఉపాధి అనుసంధాన ప్రోత్సాహకం

మొదటి సారి ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుస్తుంది. అన్ని అధికారిక రంగాలలో కొత్తగా ప్రవేశించిన వారికి ఒక నెల వేతనాన్ని అందిస్తుంది. సీతారామన్ ప్రకారం, ఈపీఎఫ్‌వోలో నమోదు చేయబడిన మొదటిసారి ఉద్యోగులకు 3 వాయిదాలలో ఒక నెల జీతం ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) రూ.15,000 వరకు ఉంటుంది. అర్హత పరిమితి నెలకు రూ.1 లక్ష జీతం. ఈ పథకం ద్వారా 210 లక్షల మంది యువతకు లబ్ధి చేకూరనుంది.

తయారీ రంగంలో ఉద్యోగ సృష్టి

ఇది ఈపీఎఫ్‌వో మార్గదర్శకాల ప్రకారం మొదటి 4 సంవత్సరాల ఉపాధి కోసం ఉద్యోగులు, యజమానులకు ప్రోత్సాహకాలను అందిస్తుంది. ఇది 30 లక్షల మంది యువతకు ప్రయోజనం చేకూరుస్తుందని, అన్ని రంగాలలో అదనపు ఉపాధిని కల్పిస్తుందని అంచనా.

యజమానులకు మద్దతు

ప్రతి అదనపు ఉద్యోగి ఈపీఎఫ్‌వో విరాళాల కోసం రెండు సంవత్సరాల పాటు యజమానులకు నెలకు రూ.3,000 వరకు రీయింబర్స్ చేయడం ద్వారా అన్ని రంగాలలో అదనపు ఉపాధి ఉన్న ఉద్యోగులకు ఇది మద్దతు ఇస్తుంది. అదనంగా 50 లక్షల మందికి ఉపాధి కల్పించడం ఈ పథకం లక్ష్యం.

శ్రామికశక్తిలో మహిళల భాగస్వామ్యాన్ని మెరుగుపరచడం

శ్రామికశక్తిలో మహిళల భాగస్వామ్యాన్ని మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. మహిళా-నిర్దిష్ట నైపుణ్య కార్యక్రమాలు, మహిళా స్వయం సహాయక బృందాలను నిర్వహించడానికి వసతి గృహాలను ఏర్పాటు చేయడం, భాగస్వామ్యాన్ని సృష్టించడం వంటి కొన్ని చర్యలు తీసుకుంటారు.

ఉపాధి కోసం అదనపు ప్రోత్సాహకాలు

500 అగ్రశ్రేణి కంపెనీలు ఐదేళ్లలో కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించే పథకాన్ని ప్రారంభించాలని ప్రతిపాదించారు. ఇంటర్న్‌షిప్ అలవెన్స్ రూ.5 వేలు నెలకు ఒక్కసారి సహాయంతో పాటు రూ.5 వేలు అందించాలి, కంపెనీలు శిక్షణ ఖర్చు, ఇంటర్న్‌షిప్ ఖర్చులో 10 శాతం వారి సీఎస్ఆర్ నిధుల నుంచి ఖర్చు చేయాలని భావిస్తున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు.

నైపుణ్య రుణ పథకానికి సవరణ

7.5 లక్షల వరకు రుణాలు అందించేలా మోడల్ నైపుణ్య రుణ పథకాన్ని సవరించనున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు.

ఇంకా, రాష్ట్రాలు, పరిశ్రమల సహకారంతో నైపుణ్యంపై దృష్టి సారించే కేంద్ర ప్రాయోజిత కొత్త పథకం 20 లక్షల మంది వ్యక్తులకు ప్రయోజనం చేకూరుస్తుంది. 1,000 శిక్షణా సంస్థలు, కొత్తగా రూపొందించిన కోర్సుల ఏర్పాటును నిర్ధారిస్తుంది. కేంద్ర బడ్జెట్ ప్రతి సంవత్సరం 25 వేల మంది విద్యార్థులకు సహాయం చేయడానికి మోడల్ స్కిల్ లోన్ స్కీమ్‌ను సవరించాలని ప్రతిపాదించింది. దేశీయ సంస్థల్లో ఉన్నత విద్య కోసం 10 లక్షలు ప్రతి సంవత్సరం లక్ష మంది విద్యార్థులకు నేరుగా రుణ మొత్తంలో 3 శాతం వడ్డీ రాయితీతో అందించనున్నట్లు మంత్రి వివరించారు. ఈ చొరవ విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను సంపాదించడంలో ఆర్థికంగా మద్దతు ఇవ్వడం, తద్వారా వారి ఉపాధి, భవిష్యత్ అవకాశాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది.

మునుపటి సంవత్సరం కేటాయింపుతో పోలిక

కేంద్ర బడ్జెట్ 2023లో విద్యా రంగానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించింది రూ.1,12,898.97 కోట్లు. ఇది ఆ సమయంలో విద్యా మంత్రిత్వ శాఖకు మంజూరు చేయబడిన అత్యధిక కేటాయింపు. ఇందులో పాఠశాల విద్యాశాఖకు రూ.68,804.85 కోట్లు, ఉన్నత విద్యాశాఖకు రూ.44,094.62 కోట్లు కేటాయించారు.

4.1 కోట్ల మంది యువతకు ఉపాధి కల్పనకు రూ.2 లక్షల కోట్లు



బడ్జెట్‌లో 4.1 కోట్ల మంది యువతకు అవకాశాలను అందించడానికి 5 పథకాలు ఉన్నాయి. వచ్చే ఐదేళ్లలో సుమారు 4.1 కోట్ల మంది యువతకు ఉపాధి అవకాశాలను కల్పించే ప్రణాళికను ఆర్థిక మంత్రి సీతారామన్ వివరించారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా ప్రభుత్వం రూ.2 లక్షల కోట్లు కేటాయించింది. అదనంగా, ఐదేళ్ల వ్యవధిలో 20 లక్షల మంది యువతకు నైపుణ్యం కల్పించాలనే లక్ష్యంతో ఆర్థిక మంత్రి నైపుణ్యం కలిగిన పౌరులకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు రూ.1.48 కోట్లను ప్రతిపాదించారు. 1,000 పారిశ్రామిక శిక్షణా సంస్థలను నవీకరణ చేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా ప్రోత్సాహకం అందజేయడంతో పాటు అన్ని రంగాల్లోని మొదటి సారి ఉద్యోగులందరికీ ఒకేసారి వేతనాన్ని అందించాలని ప్రతిపాదించారు. ఐదేళ్లలో కోటి మంది యువతకు 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలను ప్రారంభించనున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. 'ఇంటర్న్‌లు నెలకు రూ. 5000 భత్యం పొందుతారు' అని ఆర్థిక మంత్రి చెప్పారు. శిక్షణ ఖర్చులలో 10 శాతం సీఎస్ఆర్ నిధుల నుంచి వచ్చే శిక్షణ ఖర్చులను కంపెనీలు భరిస్తాయి.

రైల్వేకు రూ.2.62 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ (2024-2025 ఆర్థిక సంవత్సరం)లో రైల్వేలకు రూ.2.62 లక్షల కోట్లు కేటాయింపులు జరిపినట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తెలిపారు. ఈ మొత్తంలో రైల్వేలో భద్రతా వ్యవస్థల మెరుగు, కవచ్ వ్యవస్థ ఏర్పాటు కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. బడ్జెట్‌లో రైల్వేకు సంబంధించిన కేటాయింపులపై ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌లో రైల్వేకు ఎప్పుడూ లేని విధంగా రూ.2,62,200 కోట్లు కేటాయించినట్లు అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. ఇందులో రూ.1.08 లక్షల కోట్లు రైల్వే భద్రతకు వినియోగించనున్నట్లు తెలిపారు. పాత ట్రాకుల స్థానంలో కొత్తవి ఏర్పాటు, సిగ్నలింగ్ వ్యవస్థ మెరుగు, ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం, కవచ్ వ్యవస్థ ఇన్‌స్టలేషన్ ఇందులో ఉన్నాయన్నారు.

హోంశాఖకు రూ.2.19లక్షల కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో రూ.2,19,643 కోట్లను హోంశాఖకు కేటాయిస్తూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రకటించారు. రక్షణశాఖకు కేటాయించిన మొత్తంలో నుంచి అధిక భాగం అంటే రూ.1,43,275 కోట్లను కేంద్ర పోలీసు దళాలు (సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్)కు మళ్లిస్తారు. ఈ దళాలు అంతర్గతభద్రత, సరిహద్దు భద్రతతో పాటు కీలక క్షేత్రాలకు రక్షణ కల్పిస్తాయి. కేంద్రపాలిత ప్రాంతాలకు...

బడ్జెట్‌లో నుంచి రూ.42.277 కోట్లను కేంద్ర పాలిత జమ్మూకశ్మీర్ కోసం కేటాయించారు. అలాగే రూ.5,985 కోట్లను అండమాన్, నికోబార్ దీవులకు, రూ.5,852 కోట్లను చండీగఢ్ కోసం, రూ.5,958 కోట్లను లధాక్‌కే కేటాయిస్తూ బడ్జెట్‌ను సీతారామన్ ప్రతిపాదించారు. కేంద్ర బడ్జెట్ వ్యయానికి రూ.1,248 కోట్లు కేటాయించారు. విపత్తు నివారణ, పునరావాస, సహాయక చర్యల కోసం రూ.5,458 కోట్లను కేటాయించారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు 'గ్రాంట్స్ ఇన్ ఎయిర్' ప్రకటించారు.

'ముద్రా' పరిమితి రూ.20 లక్షలు

న్యూఢిల్లీ: ముద్రా రుణాల పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు కేంద్రం పెంచింది. ఈ మేరకు కేంద్ర బడ్జెట్‌ను మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టే సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. రుణాలను విజయవంతంగా చెల్లించిన వారికి రూ.20లక్షల వరకు రుణాలిచ్చేందుకు వీలుగా ముద్రా రుణాల పరిమితిని పెంచుతున్నట్లు వెల్లడించారు. 'తరుణ్ విభాగం' వారికి ఈ సౌకర్యం ఉంటుందన్నారు. ప్రధానమంత్రి ముద్రా యోజన (పీఎంఎంవై) కింద కార్పొరేట్‌యేతర, చిన్న, మధ్యస్థాయి వ్యాపారులకు రుణాలిస్తారు. ప్రస్తుతం రూ.10లక్షల వరకు రుణాన్ని మూడు విభాగాల్లో - శిశు (రూ.50వేల వరకు), కిశోర్ (రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు), తరుణ్ (రూ.10లక్షలు) ఇస్తున్నారు. గిరిజన వర్గాల సామాజిక-ఆర్థిక పరిస్థితుల మెరుగుదలకుగాను ప్రధానమంత్రి జనజాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్‌ను తెస్తున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. 63వేల గ్రామాల పరిధిలోని ఐదు కోట్ల మంది గిరిజనులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. అలాగే పీఎం విశ్వకర్మ, పీఎం స్వానిధి, జాతీయ జీవనోపాధి మిషన్లు, స్టాండప్ ఇండియా వంటి పథకాల కింద సేవలను మరింతగా విస్తరించనున్నట్లు సీతారామన్ వెల్లడించారు. ఎస్ఐడీబీఐ కొత్త శాఖలు ప్రారంభమవుతాయని, మూడేళ్లలోపు అన్ని ప్రధాన ఎంఎస్ఎంఈల క్లస్టర్లకు వీటి సేవలు విస్తరిస్తాయని, ప్రత్యక్ష రుణ సౌకర్యాన్ని కల్పిస్తాయని చెప్పారు. ఈ ఏడాది 24 శాఖలు ప్రారంభమవుతాయని, 168 నుంచి 242 మేజర్ క్లస్టర్లకు సేవలు విస్తరిస్తాయని తెలిపారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ గ్యారెంటీ ఫండ్ కింద ప్రతి ఖాతాదారుడికి వంద కోట్ల వరకు రుణమిచ్చే అవకాశం ఉందన్నారు. ఇర్రాడియేషన్ యూనిట్ల ఏర్పాటకు ఆర్థిక సాయం అందిస్తామని, ఈ-కామర్స్ ఎక్స్‌పోర్ట్ హబ్‌లను పీపీపీ విధానంలో ఏర్పాటు చేస్తామన్నారు.

సబ్సిడీల్లో కోత



న్యూఢిల్లీ: ఆర్థిక స్థిరత్వమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక రంగాల రాయితీల్లో కోత భారీగా విధించింది. ఆహారం, ఎరువులు, ఇంధన రంగాల్లో ఇస్తున్న సబ్సిడీలకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మొత్తం సబ్సిడీల కోసం కేంద్రం రూ.3,81,175 కోట్లు కేటాయించింది. క్రితం ఏడాది కేటాయించిన రూ.4,13,466 కోట్లతో పోలిస్తే ఇది 7.8 శాతం తక్కువ.

ఆహార సబ్సిడీ కోసం రూ.2,05,250 కోట్లు కేటాయించింది. 2024 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తం రూ.2,12,332 కోట్లుగా ఉంది. ధాన్యం సేకరణ వ్యయం, అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయం మధ్య అంతరంతో పాటు 80 కోట్ల మందికి ఇస్తున్న ఉచిత రేషన్ వంటివి ఈ సబ్సిడీ కిందకు వస్తాయి. క్రితం ఏడాది ఎరువుల రాయితీ కోసం కేంద్రం రూ.1,88,894 కోట్లు కేటాయించింది. ఈసారి దాన్ని రూ.1,64,000 కోట్లకు తగ్గించింది. యూరియా, యూరియేతర ఎరువులతో పాటు డీఏపీ, ఎంఓపీ వంటి వాటి కోసం ఈ సబ్సిడీని కేంద్రం ఉపయోగిస్తుంది. రైతులకు కావాల్సిన వస్తువులను అందుబాటు ధరలో ఉంచేలా తయారీ సంస్థలకు సైతం ప్రోత్సాహకాలు అందిస్తుంది. వంటగ్యాస్ సహా పెట్రోలియం సబ్సిడీల కోసం కేంద్రం రూ.11,925 కోట్లు ప్రకటించింది. క్రితం ఏడాది కేటాయించిన రూ.12,240 కోట్లతో పోలిస్తే స్వల్పంగా తగ్గించింది.

ప్రజల హక్కుల కోసం పోరాటం సాగిస్తాం

జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-కడప: దేశంలో రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, పేద ప్రజల పక్షాన కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. మంగళవారం కడప సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ గత పదేళ్లుగా దేశానికి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ప్రతిపక్ష పార్టీలు, ప్రాంతీయ పార్టీల రాజకీయ హక్కులను కాల రాసిందన్నారు. సీబీఐ, ఈడీ తదితర దర్యాప్తుసంస్థలతో ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టించిందన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వంలో క్రియాశీలకంగా ఉన్న టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర హక్కులను బీజేపీ కాళ్ల దగ్గర తాకట్టు పెడుతున్నారని దుయ్యబట్టారు. విభజన చట్టంలోని అంశాల అమలు, ప్రత్యేక హోదా ఊసేలేదన్నారు. ఎన్నికల వ్యవస్థలో కులం, మతం, డబ్బు ప్రభావం తీవ్రస్థాయిలో ఉందని, అక్రమ సంపాదన ను ఓటర్లకు విచ్చలవిడిగా పంచి ఎన్నికలలో గెలిచి రెట్టింపు స్థాయిలో దోచుకుంటున్నారన్నారు.

రాయలసీమ నీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలి: ఓబులేసు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి ఓబులేసు మాట్లాడుతూ ... ప్రతి సోమవారం పోలవరం అని చెబుతున్న చంద్రబాబు పోలవరం ఎప్పటికీ పూర్తి చేస్తారు? కేంద్రం నుండి ఎన్ని నిధులు రాబడతారో స్పష్టంగా ప్రకటన చేయాలన్నారు. అత్యంత కరువు పీడిత ప్రాంతమైన రాయలసీమలో నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరు, తాగునీరు అందించాలన్నారు. రాష్ట్రంలో హత్య రాజకీయాలు విపరీతంగా పెరిగిపోతు న్నాయని... ప్రభుత్వమే వాటికి స్వస్తి పలకాలన్నారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన అన్ని హామీలను పూర్తిగా నెరవేర్చాలని... లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాటం సాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు బీ రామయ్య, ఎల్ నాగ సుబ్బారెడ్డి , ఎంవీ సుబ్బారెడ్డి , ఎన్ వెంకట శివ, పి.చంద్రశేఖర్, వీ వీరశేఖర్, జీ వేణుగోపాల్, ఎన్.విజయలక్ష్మి , సీ సుబ్రహ్మణ్యం, కేసీ బాదల్లా, వీ గంగా సురేష్ , జిల్లా సమితి సభ్యులు జీ మద్ది లేటి, బీ వెంకట రాములు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీమ ప్రాజెక్టులపై దృష్టి పెట్టండి

హరినాథరెడ్డి డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని, ఇది ఏమాత్రం ప్రజల బడ్జెట్ కాదని, కార్పొరేట్ల అనుకూల బడ్జెట్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి స్పష్టం చేశారు. తిరుపతి బైరాగి పట్టెడలోని శ్రీ గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి మెమోరియల్ హాలులో సీపీఐ జిల్లా సమితి సమావేశం కత్తి రవి అధ్యక్షతన జరిగింది. హరినాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించకపోవడం, పోలవరం, రాజధాని నిర్మాణానికి బడ్జెట్‌లో స్పష్టమైన కేటాయింపులు లేకపోవడం దుర్మార్గమన్నారు. తిరుపతి నగరంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, ఈ సమస్య పరిష్కారానికి కండలేరు డ్యామ్ నుంచి తిరుపతికి తాగునీరు అందించాలని పోరాటాలు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. 17 కోట్ల రూపాయలతో సోమశిల ద్వారా కండలేరు డ్యామ్ నుంచి పైపులైన్ పంపించవచ్చని నివేదిక పంపించారని, అందుకు తగిన నిధులు కేటాయిం చకపోవడంతో నీటి కొరత పెరిగిపోతున్నదన్నారు. ఇప్పుడు హడావుడిగా కండలేరు డ్యామ్ కట్ట తెగ కొట్టి నీటిని మళ్లించడం వల్ల రానున్న రోజుల్లో తీరని నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. రాయలసీమ పడమటి ప్రాంతా లలో సాగునీరు, తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా...సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం బాధాకరమన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కనీస బాధ్యతగా రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేసి సాగునీరు, తాగునీటి కొరత తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి ఆర్డీవో కార్యాలయంలో కీలక ఫైళ్లను కొంతమంది భూ కబ్జాదారులు, అవినీతి అధికారులు కలసి తగల బెట్టడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. అవినీతి అధికారులను వెంటనే గుర్తించి...అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్ ఒంటెత్తు పోకడ, అహంభావం వల్ల ఘోర ఓటమి చవిచూశారన్నారు. జగన్ హయాంలో అవినీతి, ప్రత్యర్థులపై దాడులు, అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. నేటి ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తే ప్రజలు తగిన పాఠం చెబుతారని, అలా కాకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో పాలన సాగిస్తే ప్రజలు ఆదరిస్తారని హరినాథరెడ్డి సూచించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల కాలనీలలో కనీస సౌకర్యాలు లేవని, కనీస స్మశానవాటికలు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పార్టీ శాఖల బలోపేతానికి నియోజకవర్గ బాధ్యులు పనిచేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ భవిష్యత్తు కార్యక్రమాల రూపకల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన పోరా టాలను నిర్దేశించారు. సమావేశం ప్రారంభానికి ముందు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నం పెంచలయ్య ఇటీవల మృతిచెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

బీహార్‌కు రూ.26 వేల కోట్లు

- మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

న్యూఢిల్లీ: బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదంటూ స్పష్టం చేసిన మోదీ సర్కారు...వార్షిక బడ్జెట్‌లో మాత్రం ఆ రాష్ట్రానికి పెద్దపీట వేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రతిపాదనలు చదువుతూ... బీహార్‌కు రూ.26వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సాయం కింద వివిధ అభివృద్ధి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రకటించారు. బహుళపక్ష అభివృద్ధి సంస్థల సహాయం ద్వారా కేంద్ర ప్రభుత్వం బీహార్ కు ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలన్న జనతాదళ్ (యునైటెడ్) డిమాండ్‌ను మోదీ సర్కారు తిరస్కరించిన మరుసటి రోజే ఈ ప్రకటన రావడం గమనార్హం. వచ్చే ఆర్థిక సంవత్సరానికి బీహార్‌లో వివిధ రోడ్డు ప్రాజెక్టుల కోసం రూ. 26వేల కోట్లను కేటాయిస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. బీహార్‌లో విమానా శ్రయాలు, వైద్య కళాశాలలు, క్రీడా మౌలిక సదుపాయాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని హామీ ఇచ్చారు. బీహార్‌కు ప్రకటించిన ప్రాజెక్టుల్లో ముఖ్యాంశాలు చూసినట్లయితే... రూ.21,400 కోట్ల వ్యయంతో పీర్ పాయింట్ వద్ద 2400 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుతో సహా విద్యుత్ ప్రాజెక్టులు చేపట్టబడతాయి. బీహార్ లో కొత్త విమానాశ్రయాలు, వైద్య కళాశాలలు, క్రీడా మౌలిక సదుపాయాలను నిర్మిస్తారు. బహుళపక్ష అభివృద్ధి బ్యాంకుల నుంచి బాహ్య సహాయం కోసం బీహార్ ప్రభుత్వ అభ్యర్థనలను వేగవంతం చేస్తారు. గయాలో ఇండస్ట్రియల్ నోడ్... బీహార్ లోని గయ నగరాన్ని తూర్పు భారతదేశంలో పారిశ్రామిక నోడ్ గా అభివృద్ధి చేస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. పాట్నా - పూర్ణియా ఎక్స్‌ప్రెస్ వే, బక్సర్ - భాగల్పూర్ హైవే, బోధ్గయా - రాజ్గిర్ - వైశాలి - దర్భాంగా, బక్సర్లో గంగా నదిపై రూ. 26,000 కోట్లతో అదనపు రెండు వరుసల వంతెన అభివృద్ధికి కూడా సహాయం చేస్తామని పేర్కొన్నారు. ఆక్సిలరేటెడ్ ఇరిగేషన్ ఫండ్ ద్వారా బీహార్ లో ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. పర్యాటకంలో భాగంగా టెంపుల్ కారిడార్లను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. నలంద యూనివర్సిటీ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని ప్రకటించారు.

ప్రత్యేక సాయం మొదలైంది: నితీశ్

కేంద్ర బడ్జెట్‌పై బీహార్ సీఎం, జేడీయూ అధినేత నితీశ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను నిరంతరం ప్రత్యేక హోదాను కోరుతూనే ఉన్నానని, ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజి ఏదో ఒకటి ఇవ్వాలని ఎన్డీఏ పెద్దలను అడిగానని సీఎం నితీశ్ కుమార్ తెలిపారు. తాను అడిగినందునే చాలా విషయాల్లో సాయం ప్రకటించారని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా గురించి తాము మాట్లాడుతూనే ఉన్నప్పటికీ ఇందుకు సంబంధించిన నిబంధనలకు గతంలోనే ముగింపు పలికామని చెబుతున్నారని, కాబట్టి బీహార్‌కు ప్రత్యేక సాయం అందించాల్సి ఉందని, అది మొదలైందని ఆయన అన్నారు. ఇక బడ్జెట్ పట్ల సంతృప్తిగా ఉన్నారా? అని మీడియా ప్రశ్నించగా... ప్రత్యేక హోదా అయినా.. ప్రత్యేక ప్యాకేజీ అయినా ఏదో ఒకటి కావాలని డిమాండ్ చేసింది తామేనని వ్యాఖ్యానించారు.

వ్యవసాయ రంగం కోసం విజన్ లేదు

కేఎంఎం, ఎస్‌కేఎం నేతలు పంధేర్, దల్లేవాల్

చండీగఢ్: కేంద్రం ప్రవేశపెట్టినది దిశలేని ఫ్లాప్ బడ్జెట్ అని రైతు నాయకులు తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తంచేశారు. వ్యవసాయ రంగానికి మొండిచేయి చూపారని, సేద్యానికి సంబంధించి విజన్ లేని బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని విమర్శించారు. రుణమాఫీ ఊసే లేదని, కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కు చట్టబద్ధతపై ఎలాంటి ప్రకటన చేయలేదని కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ అన్నారు. వ్యవసాయ రంగాభివృద్ధికి బడ్జెట్‌లో ఏ పథకాన్ని ప్రకటించలేదని, దిశలేని నిరుత్సాహపూరిత బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశపెట్టిందని వ్యాఖ్యానించారు. సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్) నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ స్పందిస్తూ వ్యవసాయ రంగానికి కేటాయింపు పెరగాల్సిందన్నారు. మొత్తం బడ్జెట్‌లో కేవలం మూడు శాతాన్ని వ్యవసాయానికి కేటాయించారని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని కేంద్రం విస్మరిస్తూనే ఉందని దల్లేవాల్ విమర్శించారు. రైతులకు సంబంధించినంత వరకు ఇది ఫ్లాప్ బడ్జెట్ అని మరొక రైతు నేత హర్మీత్ సింగ్ కడియన్ వ్యాఖ్యానించారు. పంజాబ్ రైతులకు మొండిచేయి చూపిందన్నారు. వ్యవసాయ వైవిధ్యత (డైవర్సిఫికేషన్) ప్యాకేజిగానీ ఆగ్రో-ఇండస్ట్రియల్ ప్యాకేజిగానీ ప్రకటించలేదని ఆయన అన్నారు. కాగా, రైతాంగానికి సంబంధించిన పెండింగ్ డిమాండ్ల సాధన కోసం దిల్లీ చలో మార్చ్‌కు ఎస్‌కేఎం, కేఎంఎం పిలుపు ఇచ్చాయి. వీరి సారథ్యంలోనే పంజాబ్, హర్యానా మధ్య శంభు, కనౌరి సరిహద్దులలో రైతుల ఆందోళన కొనసాగుతోంది.

ఉత్తుత్తి హామీలు కాదు... నిధులు కేటాయించాలి

- నిరుద్యోగం, ధరలు, పేదరికం వంటి మౌలిక సమస్యలను విస్మరించిన మోదీ
- కార్పొరేట్‌ల పక్షాన నిలిచిన ఎన్డీఏ బడ్జెట్
- రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్రప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నిధులు ఇస్తామని, రాజధాని అమరావతి నిర్మాణానికి వివిధ సంస్థల నుంచి రూ.15వేల కోట్లు రుణం ఇప్పిస్తామని ఉత్తుత్తి హామీలు ఇవ్వటం కాకుండా...నిర్దిష్టంగా నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై ఆయన స్పందించారు. అమరావతికి ఏకంగా రూ.15 వేల కోట్లు కేటాయించినట్లుగా చేసుకుంటున్న ప్రచారాన్ని తప్పుబట్టారు. నిరుద్యోగం, ధరలు, పేదరికం వంటి మౌలిక సమస్యలను పూర్తిగా విస్మరించిన మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేయడానికే కంకణం కట్టుకున్నట్లుగా బడ్జెట్ స్పష్టం చేస్తున్నదని దుయ్యబట్టారు. 2014 ఎన్నికల సందర్భంలో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఏటా 2 కోట్ల ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి... ఎక్కడా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడం వల్ల రికార్డు స్థాయిలో నిరుద్యోగం పెరిగిందన్నారు. ఇప్పుడు రాబోయే ఐదేళ్లలో 4 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తామని ఆర్థిక మంత్రి చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పెట్రోల్ ఉత్పత్తులు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటి సామాన్యుల జీవితం దుర్భరంగా మారిందన్నారు. ప్రజల నడ్డివిరుస్తున్న ధరలపై కేంద్రం చర్యలు ఏమీ లేవని విమర్శించారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణం విషయంలో నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా, పునరావాస ప్యాకేజీ ఇవ్వకుండా ప్రాజెక్టు పూర్తి చేస్తామనడం దుర్మార్గం అన్నారు. పోలవరం నిర్వాసితులకు ఇవ్వవలసిన దాదాపు రూ.33 వేల కోట్ల ప్యాకేజీకి తగువిధంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మాయ మాటలు కట్టిపెట్టి వెనకబడిన ఉత్తరాంధ్ర రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇవ్వాలన్నారు. చెన్నైన కారిడార్, హైదరాబాద్ బెంగళూరు కారిడార్ల విషయంలో ఆయా ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ హబ్స్ ఏర్పాటు చేసి అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వటం ద్వారానే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జేడీయూ నేత నితీశ్‌కుమార్‌తో కలిసి కేంద్రం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. గత ప్రభుత్వం మూడు రాజధానుల జపం చేయడం వల్ల ఏ రాజధాని అభివృద్ధి కాకుండా పోయిందన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని రాజధానిగా గుర్తించడంతో ఐదేళ్లుగా అభివృద్ధికి దూరంగా ఉన్న రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతం కావాలంటే కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు ఏమాత్రం సరిపోవన్నారు. కేంద్రం పార్లమెంట్‌లో హామీలు ఇచ్చి చేతులు దులుపుకోవటం కాకుండా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాల్సిన బాధ్యత మోదీ ప్రభుత్వంపై ఉందన్నారు.

మాటలు జాస్తి... కేటాయింపులు నాస్తి!!

కేంద్ర బడ్జెట్‌పై ముప్పాళ్ల నాగేశ్వరరావు



విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: ఆంధ్ర రాష్ట్రాభివృద్ధి విషయంలో మాటలు జాస్తి! కేటాయింపులు నాస్తి!! చందంగా కేంద్ర బడ్జెట్ ఉందని సీపీఐ ఏపీ సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. రాజధాని అమరావతికి రూ.15వేల కోట్లు కేటాయింపు అభినందనీయమన్నారు. పోలవరం ప్రాజెక్టు, విశాఖ-చెన్నై కారిడార్ విషయంలో మాటలు తప్ప కేటాయింపులు లేకపోవడాన్ని చూస్తే అరకొరతో కాలయాపన చేసే ప్రమాదం ఉందని అన్నారు. బీహార్‌కు నిధుల కేటాయించి, ఏపీకి మాటల వరాలు ఆందోళనకరమని, వ్యవసాయ రంగ సంస్కరణల పేరుతో సన్న, చిన్నకారు రైతులను సాగు భూముల నుంచి తప్పించే ప్రమాదకర ధోరణి దాగి ఉందని ముప్పాళ్ల అన్నారు. 500 పరిశ్రమల్లో 4 కోట్ల ఉద్యోగాలు అన్న మాట నిరుద్యోగ యువతను మోసగించటమేనన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా పోరాటం అనివార్యమనే స్థితిని బీజేపీ ప్రభుత్వం కల్పిస్తోందని ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు.

అగ్ని ప్రమాద ఘటనపై విచారణ

ఆర్డీవో కార్యాలయాన్ని పరిశీలించిన సిసోడియా

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాద స్థలాన్ని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) సిసోడియా పరిశీలించారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ట్రాన్స్‌కో జేఎండీ చక్రధర్ బాబు, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తదితరులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ అగ్ని ప్రమాద ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై చాలా సీరి యస్‌గా ఉందని, అగ్ని ప్రమాదానికి గల కారణాలను త్వరితగతిన గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆదివారం అర్ధరాత్రి ఎన్ని గంటలకు అగ్నిప్రమాదం సంభవించింది. ఆ సమయంలో కార్యాలయంలో ఎవరెవరు ఉన్నారు. షార్ట్ సర్క్యూట్ ఎలా జరిగింది. ఇన్వర్టర్లు ఎక్కడెక్కడ ఉన్నాయి. సబ్ కలెక్టర్ చాంబర్ ఎక్కడా? వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన 22(ఎ) విభాగానికి సంబంధించిన గదిలోని కాలిపోయిన ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం చుట్టు పక్కల, ఆర్డీవో కార్యాలయం వెలుపలి వైపు చుట్టూ ప్రహరీ గోడను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె, రాయచోటి ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు

ఆరోగ్యవర్సిటీ పేరు మార్పు బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండు కీలక బిల్లులు మంగళవారం శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ఏపీ భూ యాజమాన్య హక్కు చట్టాన్ని (ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2022) రద్దు, విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పు బిల్లులను సభ ఆమోదించింది. వర్సిటీ పేరును వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయంగా గత ప్రభుత్వం మార్చింది. ఇప్పుడు మళ్లీ ఎన్టీఆర్ పేరు పునరుద్ధరించారు. ఈ మేరకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటన చేశారు. ఆయన తెలుగులోనే ప్రకటన చేయడం గమనార్హం. ఒక్క ఆంగ్ల పదం కూడా వాడకుండా బిల్లులు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించడాన్ని సభ్యులు అభినందించారు.

కేరళ డిమాండ్‌ను పట్టించుకోలేదు: మంత్రి బాలగోపాల్

తిరువనంతపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై కేరళ ఆర్థిక మంత్రి కేఎన్ బాలగోపాల్ తీవ్రంగా విమర్శించారు. ఇది ఓ 'గిమ్మిక్కు' అని, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ ప్రయోజనాలు కాపాడేందుకు ఉద్దేశించిన 'రాజకీయ కసరత్తు'గా అభివర్ణించారు. కేంద్ర బడ్జెట్ దేశప్రజలందరినీ తీవ్రంగా నిరాశపరిచిందని మండిపడ్డారు. కేరళతో పాటు బడ్జెట్‌లో న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో విఫలమైందని విమర్శించారు. రూ.24 వేలకోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కేరళ డిమాండ్‌ను బడ్జెట్ పట్టించుకోలేదని నిందించారు. విజింజం అంతర్జాతీయ ఓడరేవు ప్రాజెక్టుకు రూ.5 వేల కోట్ల ప్రత్యేక సహాయం, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) కోసం చాలాకాలంగా ఉన్న డిమాండ్లను పక్కనపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్‌లో కీలక రంగాల కేటాయింపులను కుదించారని ధ్వజమెత్తారు. ఆహార సబ్సిడీ 2022-23లో రూ.2,72,000 కోట్ల నుండి రూ.2,05,250 కోట్లకు తగ్గించారు. ఎరువుల సబ్సిడీని రూ.2,51,000 నుండి రూ.1,64,000 కోట్లకు తగ్గించారని, ఎంజీఎన్ఆర్ఈజీ పథకానికి కూడా 2022-23లో రూ.90,806 కోట్ల నుండి రూ.86,000 కోట్లకు పడిపోయిందని అన్నారు. బడ్జెట్‌లో ఉపాధి కల్పన గురించి ప్రత్యేకంగా వ్యాఖ్యానించినప్పటికీ... ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకానికి కేటాయింపులు రూ.2,733 కోట్ల నుండి రూ.2,300 కోట్లకు తగ్గాయి. రాష్ట్రానికి చెందిన బీజేపీ కేంద్ర మంత్రులు, ప్రతిపక్ష యూడీఎఫ్ ఎంపీలు సహా అందరూ రాష్ట్ర హక్కుల కోసం పోరాడేందుకు ఐక్యంగా నిలబడాలని కోరారు.

రూ.50 వేల కోట్ల పెట్టుబడుల ఉపసంహరణ

న్యూఢిల్లీ: పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తులపై ఆదాయం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.50వేల కోట్లు సమకూరుతాయని కేంద్రం అంచనా వేసినట్లు డీఐపీఏఎం కార్యదర్శి తున్హిన్ కాంత పాండే తెలిపారు. సీపీఎస్ఈల నుంచి డివిడెంట్ల రూపేణ రూ.56,260 కోట్లు వస్తాయన్న అంచనా కూడా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఆర్బీఐ, బ్యాంకులు, ఆర్థిక వ్యవస్థల నుంచి వచ్చే డివిడెంట్ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.2,32,874 కోట్లు సమకూరుతాయని కేంద్రం అంచనా వేసింది. గత మధ్యంతర బడ్జెట్ అంచనా రూ.1.02లక్షల కోట్లు కాగా ప్రస్తుత అంచనా దానికి రెట్టింపుగా ఉంది. రూ.2.11లక్షల కోట్ల ఆర్బీఐ విండ్‌ఫాల్ డివిడెంట్ వల్ల ఈ మొత్తం భారీగా పెరిగింది.

దివ్యాంగుల సంక్షేమానికి రూ.1,225 కోట్లు

న్యూఢిల్లీ: దివ్యాంగుల సాధికారత శాఖ (డీఈపీడబ్ల్యూడీ)కు కేంద్ర బడ్జెట్‌లో రూ.1,225.27 కోట్లను కేటాయించారు. ఈ మేరకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంటులో ప్రకటించారు. గతసారి కేటాయింపుతో పోల్చితే ఈసారి కేవలం 0.02శాతం మేర పెంపుదల ఉన్నది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,225.01కోట్లు కేటాయించారు. తాజా కేటాయింపులో నుంచి దాదాపు సగం అంటే రూ.615.33 కోట్లను దివ్యాంగుల సంక్షేమం కోసం ఈఆర్థిక సంవత్సరంలో చేపట్టే జాతీయస్థాయి కార్యక్రమాలకు వినియోగిస్తారు.

కోటి ఇళ్లకు ఉచితంగా 300 యూనిట్ల సౌరవిద్యుత్

కోటి ఇళ్లకు 300 యూనిట్ల వరకు సౌర విద్యుత్‌ను ఉచితంగా అందించనున్నట్లు ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద కోటి ఇళ్లలో సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గ్రీన్ గ్రోత్, పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించడానికి అనేక చర్యలను ప్రకటించారు. బడ్జెట్ ప్రసంగంలో రూఫ్‌టాప్ సోలార్ స్కీమ్‌కు విశేష స్పందన వచ్చినట్లు చెప్పారు. 1.28కోట్ల రిజిస్ట్రేషన్లు, 14 లక్షల దరఖాస్తులు వచ్చాయని, ఈ పథకాన్ని మరింత ప్రోత్సహిస్తామన్నారు. 2023-24 బడ్జెట్‌లో సౌర ప్రాజెక్టులకు రూ.7,327 కోట్లు కేటాయించారు.

ఎన్‌పీఎస్ సమస్యలకు పరిష్కారం కనుగొంటాం

కొత్త పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్) సమస్యలను పరిష్కరించి, తగు పరిష్కారాన్ని రూపొందించే పనిలో సంబంధిత కమిటీ ఉన్నట్లు ఆర్థికమంత్రి స్పష్టం చేశారు. ఎన్‌పీఎస్‌ను సమీక్షించే కమిటీ తన పనిలో గణనీయమైన పురోగతిని సాధించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం నేషనల్ కౌన్సిల్ ఆఫ్ జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ సిబ్బంది నిర్మాణాత్మక విధానాన్ని తీసుకున్నారని ఆమె అన్నారు. 'సామాన్య పౌరులను రక్షించడానికి ఆర్థిక వివేకాన్ని కొనసాగిస్తూ సంబంధిత సమస్యలకు పరిష్కారం రూపొందించబడుతుంది' అని మంత్రి చెప్పారు. ఎన్‌పీఎస్ కోసం యాజమాన్యం వ్యయ మొత్తాన్ని ఉద్యోగి జీతంలో 10 నుండి 14 శాతానికి పెంచాలని ప్రతిపాదించినట్లు ఆమె చెప్పారు. అదేవిధంగా, కొత్త పన్ను విధానాన్ని ఎంచుకుని, ప్రైవేట్ సెక్టార్, ప్రభుత్వ రంగ బ్యాంకులు, సంస్థలలోని ఉద్యోగుల ఆదాయం నుండి జీతంలో 14 శాతం వరకు ఈ వ్యయాన్ని మినహాయించాలని ప్రతిపాదించబడింది.

ప్రతి రూపాయిలో ప్రత్యక్ష, పరోక్ష పన్నుల వాటా 63 పైసలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఖజానాకు జమ అయ్యే ప్రతి రూపాయిలో 63 పైసల అతిపెద్ద వాటా ప్రత్యక్ష, పరోక్ష పన్నులదే. మిగిలిన 27 పైసలు రుణాలు, ఇతరత్రా ఇచ్చి అప్పుల ద్వారా, 9 పైసలు పెట్టుబడి ఉపసంహరణ వంటి పన్నుయేతర ఆదాయం నుంచి, 1 పైసా రుణేతర మూలధన రశీదుల నుంచి వస్తాయని కేంద్ర బడ్జెట్ పత్రాలు తెలిపాయి. మొత్తం మీద కార్పొరేట్, వ్యక్తిగత ఆదాయపు పన్నుతో సహా ప్రత్యక్ష పన్నుల నుంచి 36 పైసలు వస్తుండగా... ఆదాయపు పన్ను 19 పైసలు, కార్పొరేట్ పన్ను ద్వారా 17 పైసలు ఆదాయం ప్రభుత్వానికి లభిస్తోంది. పరోక్ష పన్నులలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) ప్రతి రూపాయి ఆదాయంలో గరిష్ఠంగా 18 పైసలను అందిస్తుంది. అంతేకాకుండా ఎక్సైజ్ సుంకం ద్వారా ప్రతి రూపాయిలో 5 పైసలు, కస్టమ్స్ లెవీ నుండి 4 పైసలు సంపాదించాలని ప్రభుత్వం చూస్తోంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో సమర్పించిన కేంద్ర బడ్జెట్ 2024-25 ప్రకారం రుణాలు, ఇతర అప్పుల ద్వారా వసూళ్లు రూపాయికి 27 పైసలుగా ఉంటాయి. ఖర్చుల విషయానికొస్తే వడ్డీ చెల్లింపులు, పన్నులు, సుంకాలలో రాష్ట్రాల వాటాకు గాను వరుసగా ప్రతి రూపాయికి 19 పైసలు, 21 పైసలు. రక్షణ రంగానికి రూపాయికి 8 పైసల కేటాయింపు జరుగుతోంది.

కేంద్ర పథకాలపై ఖర్చు ప్రతి రూపాయిలో 16 పైసలు కాగా, కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేటాయింపు 8 పైసలు. ఆర్థిక సంఘం, ఇతర బదలాయింపుల ఖర్చు 9 పైసలుగా నిర్ణయించబడింది. సబ్సిడీలు, పెన్షన్‌లకు సంబంధించిన ఖర్చు వరుసగా 6 పైసలు, 4 పైసలు. ప్రభుత్వం ప్రతి రూపాయిలో 9 పైసలు 'ఇతర ఖర్చులకే వ్యయం చేస్తుంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.